RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| నిజామాబాద్ Nizamabad | సంపుటి : 03 Vol: 03 | సంచిక : 54 Vol: 54 | మార్చి 12 గురువారం 2026 March 12 Thursday 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి Editor : rachamallu madhavi | పేజీలు 08 Pages 08 | వెల : రూ. 6.00 Cost: Rs 6.00 |


తెలంగాణ గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా ప్రమాణస్వీకారం 2

## మిడిల్ ఈస్ట్ యుద్ధంపై రాజకీయమా

- కాంగ్రెస్ రాజకీయం చేస్తోంది..
- వామపక్షాలపై విరుచకపడ్డ మోడీ



**ఎర్నాకులం జన సంఘర్షణ:**
పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై కాంగ్రెస్, వామపక్ష పార్టీలు అనవసర రాజకీయాలు చేస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బుధవారం కేరళలోని ఎర్నాకులంలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడిన ఆయన, ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న భారతీయులు క్షేమంగా తిరిగి రావాలని ప్రభుత్వం కృషి చేస్తుంటే, కాంగ్రెస్ పార్టీ మాత్రం దీనిపై బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. విదేశాల్లో ఉన్న ఏ ఒక్క భారతీయుడిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, వారిని సురక్షితంగా వెనక్కి తీసుకువచ్చేందుకు కేంద్రం అన్ని ఏర్పాట్లు చేస్తోందని స్పష్టం చేశారు. ఈ క్రమంలో భారతీయులకు అండగా నిలుస్తున్న గల్ఫ్ దేశాల ప్రభుత్వాలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇదే క్రమంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ప్రధాని ఘాటు విమర్శలు సంధించారు. 'కాంగ్రెస్ యువరాజు'కు దేశాభివృద్ధి గురించి ఏమీ తెలియదని, కేవలం విమర్శించడమే ఆయన పనిగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. దేశ యువత స్టార్టప్‌ల ద్వారా డ్రోన్ల తయారీలో సాధిస్తున్న అద్భుత విజయాలపై ఆయనకు కనీస అవగాహన లేదని మోదీ దుయ్యబట్టారు. రాష్ట్రం పేరును కేరళం అని మార్చడంపై హర్షం వ్యక్తం చేస్తూ, గత ప్రభుత్వాల హయాంలో రాష్ట్రం

➤ మిగతా 2వ పేజిలో..

## 'రోడ్ సెక్టార్ పాలసీ-2047'

- రవాణా, వైద్య రంగాల్లో భారీ అభివృద్ధి పనులకు శ్రీకారం
- అధికారులతో సమీక్ష నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్ జన సంఘర్షణ**
తెలంగాణ రాష్ట్ర రూపురేఖలను సమూలంగా మార్చేలా రవాణా, వైద్య రంగాల్లో భారీ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. బుధవారం అధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో 'రోడ్ సెక్టార్ పాలసీ-2047' లక్ష్యంగా కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని రవాణా వ్యవస్థను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని, ముఖ్యంగా హైదరాబాద్ నగరం నుంచి రాష్ట్రంలోని ఏ ప్రాంతానికైనా నిర్ణీత సమయంలో చేరుకునేలా రోడ్ల నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయాలని స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను ట్రాఫిక్ రహిత నగరంగా మార్చడమే లక్ష్యంగా కనెక్టివిటీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం సూచించారు. నగరంలో పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఇప్పటికే గుర్తించిన ప్రాంతాల్లో పనులను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని ప్రధాన జిల్లా కేంద్రాలకు రింగ్ రోడ్లను నిర్మించి, వాటిని జాతీయ రహదారులతో అనుసంధానించడం ద్వారా జిల్లాల ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయాలని ఆకాంక్షించారు. రోడ్ల విస్తరణ, భూసేకరణ వంటి అంశాల్లో జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ విభాగాల మధ్య పూర్తి సమన్వయం ఉండాలని అధికారులకు

➤ మిగతా 2వ పేజిలో..

## హాస్టళ్లపై వార్ ఎఫెక్ట్

- గ్యాస్ కొరతతో వంటకు ఇబ్బందులు...
- కొన్ని రకాల వంటలు చేయలేమంటూ ఆవేదన



**హైదరాబాద్ జన సంఘర్షణ**
పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు హైదరాబాద్‌లోని హాస్టల్స్ నిర్వహణపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధ వాతావరణం కారణంగా తలెత్తిన గ్యాస్ సంక్షోభం ఐటీ కారిడార్‌లోని హాస్టళ్లను ఇబ్బందుల్లోకి నెట్టింది. ముఖ్యంగా కమర్షియల్ గ్యాస్ సరఫరా భారీగా తగ్గడంతో హాస్టల్ యాజమాన్యాలు

➤ మిగతా 2వ పేజిలో..

## వెలుగుమట్లలో మోడల్ కాలనీ నిర్మిస్తాం

- ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క




**ఖమ్మం జన సంఘర్షణ**
ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భూదాన్ భూముల్లో అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లుతో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ, వెలుగుమట్లలో దేశమే గర్వించేలా ఒక 'మోడల్ కాలనీ'ని నిర్మిస్తామని ప్రకటించారు. డిసెంబర్ 9వ తేదీ నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా గృహప్రవేశాలు చేయించడమే తమ లక్ష్యమని అధికారులను ఆదేశించారు. పేదల నిస్సహాయతను ఆసరాగా చేసుకుని గత పదేళ్లుగా కొందరు మాఫియా శక్తులు రాజకీయాలు చేస్తూ అమాయకుల వద్ద లక్షలాది రూపాయలు వసూలు చేశారని భట్టి

➤ మిగతా 2వ పేజిలో..

## వీగిపోయిన అవిశ్వాసం

- చర్చ ముగిసిన అనంతరం ఓటింగ్



**న్యూఢిల్లీ జన సంఘర్షణ**
లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాలు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం బుధవారం మూజువాణి ఓటుతో వీగిపోయింది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావేద్ ప్రవేశపెట్టిన ఈ తీర్మానంపై రెండు రోజుల పాటు సభలో సుదీర్ఘంగా చర్చ జరిగింది. ప్యానెల్ స్పీకర్ జగదాంబికా పాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ చర్చలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం సాగింది. చర్చ ముగిసిన అనంతరం ఓటింగ్ నిర్వహించగా, మెజారిటీ సభ్యులు తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేయడంతో అది వీగిపోయినట్లు ప్యానెల్ స్పీకర్ ప్రకటించి, సభను గురువారానికి వాయిదా వేశారు. ఈ

➤ మిగతా 2వ పేజిలో..

## ఆస్కార్‌కు రంగం సిద్ధం

**న్యూఢిల్లీ జన సంఘర్షణ**
సినిమా రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన 'ఆస్కార్' (అకాడమీ అవార్డ్స్) 98వ వేడుకకు రంగం సిద్ధమైంది. 2025లో విడుదలైన ఉత్తమ చిత్రాలు, నటీనటులు మరియు సాంకేతిక నిపుణులను గౌరవించేందుకు లాస్ ఏంజిల్స్‌లోని ప్రఖ్యాత డాల్బీ థియేటర్ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. హాలీవుడ్ టాప్ స్టార్స్ అందరూ ఒకే వేదికపై మెరవనున్న ఈ వేడుకకు అమెరికా కాలమానం ప్రకారం మార్చి 15 ఆదివారం సాయంత్రం 7 గంటలకు తెరలేవనుంది. భారతీయ కాలమానం ప్రకారం, ఈ అద్భుత దృశ్యాన్ని మార్చి 16 సోమవారం తెల్లవారుజామున 4:30 గంటల నుంచి ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించవచ్చు. ఈ ఏడాది భారతీయ ప్రేక్షకులకు మరో ప్రత్యేక ఆకర్షణ ఏమిటంటే, గ్లోబల్ స్టార్

➤ మిగతా 2వ పేజిలో..



## మిడిల్ ఈస్ట్ యుద్ధంపై రాజకీయమా

**మొదటిపేజీ తరువాయి..** ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదని విమర్శించారు. కేరళ అభివృద్ధి కోసం ఒక్కసారి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు అవకాశం ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు. త్వరలో కేరళ, తమిళనాడు సహా పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, ఈ పర్యటనలో ఆయన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు కొత్త పథకాలను ప్రారంభించారు. అనంతరం మోదీ తమిళనాడు పర్యటనకు బయలుదేరి వెళ్లారు.

# ‘రోడ్ సెక్టార్ పాలసీ-2047’

**మొదటిపేజీ తరువాయి..** దిశానిర్దేశం చేశారు. వైద్య రంగంపై సమీక్ష నిర్వహిస్తూ.. పేద ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న అన్ని టీచింగ్ హాస్పిటల్స్, పెద్దాసుపత్రుల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా నాణ్యమైన చికిత్స అందించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వెలుగుమట్లలో మోడల్ కాలనీ నిర్మిస్తాం

**మొదటిపేజీ తరువాయి..** విమర్శించారు. గత ప్రభుత్వం పేదలకు కనీసం విద్యుత్, నీటి సౌకర్యం కూడా కల్పించలేదని, కానీ తమ ప్రజా ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించి 412 మంది బాధితులకు న్యాయం చేస్తోందని తెలిపారు. తొలి ఏడాదిలోనే రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం రూ. 22,500 కోట్లు కేటాయించి ప్రభుత్వం రికార్డు సృష్టించిందని ఆయన గుర్తుచేశారు. వెలుగుమట్ల కాలనీలో రోడ్లు, డ్రైనేజీలతో పాటు ఆసుపత్రి, స్కూల్, కమ్యూనిటీ హాల్ వంటి అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, భూదాన్ ట్రస్టు సభ్యులమని చెప్పుకుంటూ కొందరు ముఠాలుగా ఏర్పడి పేదలను మోసం చేశారని మండిపడ్డారు. కోర్టు తీర్పుల వల్ల ఇన్నాళ్లూ ఇక్కడ అభివృద్ధి పనులు ఆగిపోయాయని, ఇప్పుడు చట్టబద్ధంగా పేదలకు హక్కులు కల్పిస్తున్నామని చెప్పారు. మరో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, పేదల పట్ల మొసలి కన్నీరు కార్చే వారికి తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులే సమాధానమని అన్నారు. సొంత స్థలం ఉన్న 101 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు ఇచ్చామని, మిగిలిన వారికి పట్టాలు పంపిణీ చేశామని వివరించారు. లబ్ధిదారులు ఎవరికీ భయపడకుండా ధైర్యంగా ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రులు భరోసా ఇచ్చారు.

# వీగిపోయిన అవిశ్వాసం

**మొదటిపేజీ తరువాయి..** చర్చ సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రతిపక్షాల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దాదాపు 40 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఒక స్పీకర్‌పై ఇలాంటి తీర్మానం తీసుకురావడం పార్లమెంటరీ సంప్రదాయాలను కించపరచడమేనని ఆయన మండిపడ్డారు. స్పీకర్ స్థానం అత్యున్నతమైనదని, ఆయన అందరివాడని పేర్కొంటూ.. అంకితభావంతో పనిచేస్తున్న వ్యక్తిపై పక్షపాత ఆరోపణలు చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. సభలో విపక్ష సభ్యులు నిబంధనలు ఉల్లంఘించినప్పుడే స్పీకర్ జోక్యం చేసుకుంటారని, ప్రస్తుతం అమలులో ఉన్న నియమావళి నెహ్రూ హయాంలో రూపొందించినదేనని అమిత్ షా గుర్తు చేశారు. ప్రతిపక్ష సభ్యులు స్పీకర్ స్థానంపైకి కాగితాలు విసరడం వంటి చర్యలను ఆయన తప్పుబట్టారు. సభలో ఎలా ప్రవర్తించాలో కాంగ్రెస్ నేతలకు శశి థరూర్ వంటి సీనియర్లు హితబోధ చేయాలని హితవు పలికారు. స్పీకర్ పదవిని రాజకీయ కోణంలో చూడటం మానుకోవాలని, నిబంధనలను గౌరవిస్తూ సభా మర్యాదలను కాపాడటంలో విపక్షాలు విఫలమయ్యాయని అమిత్ షా విమర్శించారు. తప్పులను సరిదిద్దుకోవడానికి ప్రతిపక్షాలకు ఇదొక మంచి అవకాశం అని ఆయన పేర్కొన్నారు.

## తెలంగాణ గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా

**రాజ్‌భవన్‌లో తెలుగులో ప్రమాణం**

**సిఎం రేవంత్ తదితరుల హాజరు**

**హైదరాబాద్, మార్చి11** : తెలంగాణ నూతన గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా ప్రమాణ స్వీకారం చేశారు.. తెలుగులో ప్రమాణం చేయడం ఆసక్తిగా మారింది. లోక్‌భవన్‌లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు హాజరయ్యారు. ముందుగా పూర్తి వందేమాతరం గేయంతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం మంత్రులతో కలసి గవర్నర్ గ్రూప్ ఫోటో దిగారు. ఇక శివ్ ప్రతాప్ శుక్లా విషయానికి వస్తే.. ఆయన 73 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ నేపథ్యం కలిగిన నేత. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆయన, ఏబీవీపీ ద్వారా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. ఎమర్జెన్సీ సమయంలో జైలుకు సైతం వెళ్లారు. యూపీలో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, కేబినెట్ మంత్రిగా, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. 2023-2026 మధ్య హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.

# ఆస్కార్‌కు రంగం సిద్ధం

**మొదటిపేజీ తరువాయి..** ప్రియాంక చోప్రా జోనాస్ ఈ వేదికపై ప్రజెంటర్‌గా వ్యవహరించనున్నారు. ఆమెతో పాటు రాబర్ట్ డౌనీ జూనియర్, అన్నే హాత్వే, గ్వినేత్ పాల్ట్రో మరియు పాల్ మెస్కల్ వంటి అంతర్జాతీయ తారలు అవార్డులను అందజేయనున్నారు. ప్రముఖ హాస్యనటుడు కోనన్ ఓబ్రియన్ వరుసగా రెండో ఏడాది కూడా ఈ వేడుకలకు వ్యాఖ్యాతగా (హోస్ట్) వ్యవహరించి తనదైన శైలిలో అలరించనున్నారు. భారతీయ అభిమానులు ఈ వేడుకను స్టార్ మూవీస్ ఛానల్‌తో పాటు జియో హాట్‌స్టార్ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో ప్రత్యక్షంగా చూడవచ్చు. తెల్లవారుజామున చూడలేని వారి కోసం అదే రోజు రాత్రి స్టార్ మూవీస్‌లో పునః ప్రసారం చేయనున్నారు. ఈ ఏడాది ‘సిన్నర్స్’ చిత్రం ఏకంగా 16 నామినేషన్లతో రికార్డు సృష్టించి, అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

# హాస్టళ్లపై వార్ ఎఫెక్ట్

**మొదటిపేజీ తరువాయి..** దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి. నగరవ్యాప్తంగా సుమారు 11 వేల హాస్టల్స్ ఉండగా, వాటిలో లక్షలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు నివసిస్తున్నారు. ప్రస్తుతం గ్యాస్ కొరత కారణంగా భోజన మెనూలో మార్పులు చేయక తప్పడం లేదని హాస్టల్ అసోసియేషన్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ వినియోగం ఎక్కువగా ఉండే చపాతీ, దోశ వంటి ఆహార పదార్థాల సరఫరాను తగ్గిస్తున్నట్లు యాజమాన్యాలు ప్రకటించాయి. ప్రస్తుతం విద్యాసంస్థలు, ఆసుపత్రులకు అనుబంధంగా ఉన్న హాస్టళ్లకు మాత్రమే గ్యాస్ అందుతోందని, ప్రైవేట్ హాస్టళ్లకు సరఫరా నిలిచిపోయిందని వారు పేర్కొన్నారు. కమర్షియల్ గ్యాస్ అందుబాటులో లేనప్పుడు, కనీసం రోజుకు ఒక డొమెస్టిక్ సిలిండర్ అయినా ఇచ్చి ఆదుకోవాలని వారు కోరుతున్నారు. ఈ సమస్యపై అధికారులకు విన్నవించినా సరైన స్పందన లేదని, పరిస్థితి ఇలాగే కొనసాగితే హాస్టళ్ల నిర్వహణ కష్టతరమవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఎస్సీ విద్యార్థుల ఖాతాల్లోకి 374 కోట్ల రూపాయల నిధులు

**హైదరాబాద్, మార్చి11 :** పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్స్ క్రింద ఎస్సీ విద్యార్థులకు బోధనా రుసుములు మరియు మెయింటెనెన్స్ చార్జీలను 2024-25 సంవత్సరం నుండి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో చెల్లిస్తున్నాయన్న విషయమూ, అట్టి సొమ్ము విద్యార్థుల ఖాతాల్లోకి నేరుగా జమ చేయడం జరుగుతోంది. ఇందులో భాగంగా ఈ సంవత్సరంలో ఇప్పటికి రూ. 374.00 కోట్ల నిధులు, రాష్ట్రంలోని వివిధ కళాశాలలకు చెందిన 83239 మంది ఎస్సీ విద్యార్థుల ఖాతాల్లోకి నేరుగా జమ చేయడమైనది. ఇందులో రాష్ట్రప్రభుత్వం తన వాటా కింద రూ.173.00 కోట్లు విడుదల చేయగా కేంద్రప్రభుత్వం రూ. 201.00 కోట్లు విడుదల చేసింది. విద్యార్థులు తమకు చెందిన మెయింటెనెన్స్ అమౌంట్ ను మినహాయించుకుని, బోధానా రుసుమును (ట్యూషన్ ఫీజు) ఇతరేతర రుసుములను కళాశాలకు చెల్లించాల్సి ఉంటుంది. ఉపకారవేతన నిధులు జమ చేయబడిన విద్యార్థుల వివరాలు సంబంధిత కళాశాల ప్రిన్సిపల్స్ ఈ-పాస్ లాగిన్స్ లో పొందుపరచడం కూడా జరిగిందని తెలియజేస్తున్నాం. నిధులను విడుదల చేసిన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, ఉపముఖ్యమంత్రివర్యులు ఆర్థిక శాఖామాత్యులు భట్టి విక్రమార్క రికి ఉపకారవేతనాలు పొందిన విద్యార్థులు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. నిధుల విడుదలకై విశేషమైన కృషి చేసిన ఎస్సీ అభివృద్ధిశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కి ఎస్సీ విద్యార్థులందరూ మనస్ఫూర్తిగా తమ కృతజ్ఞతలు తెలియజేశారు.

## స్పీకర్ తీర్పు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

**ఫిరాయింపు ఎమ్మెల్యేల తీర్పుపై లక్ష్మణ్**

**న్యూఢిల్లీ, మార్చి11** : పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని బీజేపీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ అభివర్ణించారు. ఇది చీకటి రోజు అని పేర్కొన్నారు. బుధవారం పార్టీ ఫిరాయింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు దానం, కడియం శ్రీహరిల పిటిషన్లను స్పీకర్ గడ్డం ప్రసాద్ బుధవారం విచారించారు అనంతరం ఆ పిటిషన్లను ఆయన కొట్టేశారు. ఈ వ్యవహారంపై బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ న్యూఢిల్లీలో స్పందించారు. ఈ వ్యవహారం సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందన్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ మారిన ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు సైతం ఇచ్చారని గుర్తు చేశారు. పార్టీ ఫిరాయింపులకు నిర్వచనం ఏమిటంటూ సందేహం వ్యక్తం చేశారు. ఒకరు ఎంపీగా పోటీ చేశారని.. ఇంకొకరు ఎన్నికల్లో ప్రచారం చేశారని గుర్తు చేశారు. గతంలో నైతిక విలువలతో అటల్ బీహార్ వాజపేయి రాజీనామా చేసి, ప్రజల్లోకి వెళ్లి ఎన్నికల్లో గెలిచారని సోదాహరణగా వివరించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇవ్వడం తెలంగాణ రాష్ట్రానికి మచ్చ అని అభిప్రాయపడ్డారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ హోల్‌సేల్‌గా.. నేడు కాంగ్రెస్ పార్టీ రిటైల్‌గా వ్యవహరించిందని వ్యంగ్యంగా అన్నారు. రాహుల్ గాంధీకి ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం ఉంటే.. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వ విధానంపై స్పందించాలని అభిప్రాయపడ్డారు. శాసనసభ స్పీకర్ వ్యవస్థకు మచ్చ తెచ్చే విధంగా వ్యవహరించారని విమర్శించారు. దేశానికి తలవంపులు తెచ్చే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీరు ఉందన్నారు. ఇంత గుడ్డిగా వ్యవహరించడం దేని కోసమని సందేహం వ్యక్తం చేశారు. రక్షకులు భక్షకులుగా మారారంటూ బీజేపీ ఎంపీ కె. లక్ష్మణ్ ధ్వజమెత్తారు.

## అగ్నిప్రమాదంపై విచారణ

**ఆదేశించిన హోంమంత్రి అనిత**

**అమరావతి, మార్చి11** : అమరావతిలోని వెలగపూడి అగ్నిప్రమాదం ఘటనపై హోంమంత్రి అనిత విచారణకు ఆదేశించారు. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా? లేదా కుట్ర కోణం దాగి ఉందా? అనే అంశాలపై విచారణ చేపట్టాలన్నారు. ఘటనాస్థలంలో సమీప పొలం నుంచి మంట వచ్చిందని ఎల్ అండ్ టీ ప్రతినిధులు చెప్పారు. పొలంలో గడ్డి పేర్చి నిప్పుపెట్టిన ఆనవాళ్లను చూపించారు. అమరావతిలో వెలగపూడి సీడ్ యాక్సిస్ రోడ్డు వద్ద భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు పక్కన మంటలు చెలరేగి ఎల్ అండ్ టీ సంస్థకు చెందిన ఎ÷-లాస్టిక్ పైపులు దగ్ధమయ్యాయి. భారీగా మంటలు ఎగసిపడటంతో పరిసరాల్లో దట్టంగా పొగ అలముకొంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేశారు. అయితే ఘటనపై అనుమానాలు రావడంతో విచారణకు ఆదేశించారు.

## విధి నిర్వహణలో నిర్లక్ష్యం

**ఇద్దరు పంచాయితీ కార్యదర్శలు సస్పెన్షన్**

**రంగారెడ్డి,మార్చి11 :** రంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ’ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక’ అమలులో అలసత్వం వహించిన అధికారులపై జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు చేపట్టింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘనను తీవ్రంగా పరిగణించిన జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, సంబంధిత సిబ్బందిపై వేటు వేశారు. ప్రజా పాలన కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం చేయడంలో విఫలమైన ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫరూక్ నగర్ మండల పరిధిలోని బూర్గుల గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం. సరోజపై ఈ చర్యలు తీసుకున్నారు. పై అధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోకుండానే విధులకు గైర్హాజరు కావడం, కార్యాలయ రికార్డుల నిర్వహణలో అస్తవ్యస్తంగా వ్యవహరించడం ఆమె సస్పెన్షన్‌కు ప్రధాన కారణాలుగా నిలిచాయి. ఇదే మండలంలోని కాశిరెడ్డి గూడ పంచాయతీ కార్యదర్శి కె. వాసవాచారి కూడా విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారు. ప్రజా పాలన లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమవ్వడం, రోజువారీ కార్యక్రమాలను నిర్లక్ష్యం చేయడంతో ఆయనపై కూడా వేటు పడింది. ఈ నెల 9వ తేదీన జిల్లా పంచాయతీ అధికారి (డిపివో) సురేష్ మోహన్ ఫరూక్ నగర్ మండలంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామాల్లో పనుల తీరును పరిశీలించిన ఆయన పలు లోపాలను గుర్తించి కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. ఈ నివేదిక ఆధారంగానే క్రమశిక్షణా చర్యలు అమలయ్యాయి. కేవలం కార్యదర్శులనే కాకుండా.. పర్యవేక్షణలో విఫలమైన ఉన్నతాధికారులను కూడా కలెక్టర్ వదలలేదు. మండలంలోని కార్యదర్శులకు సరైన దిశానిర్దేశర చేయడంలో విఫలమైన ఫరూక్ నగర్ మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) ఎం. జయంత్ రెడ్డికి ఛార్జ్ మెమో జారీ చేశారు. కందుకూరు మండలంలోని కందుకూరు, ముచ్చర్ల, కొత్తగూడ గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉన్నట్లు గుర్తించారు. ముఖ్యంగా తడి చెత్త, పొడి చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహించినందుకు గాను కార్యదర్శులు ఇంద్రసేన రెడ్డి, శ్రీహరి, నరేందర్ గౌడ్లకు డీపీఓ షోకాజ్ నోటీసులు అందజేశారు.

## విపక్ష నేతకే మాట్లాడే అవకాశం ఇవ్వరా ?

**లోక్‌సభ చర్చలో ఎంపి మల్లు రవి**

**న్యూఢిల్లీ, మార్చి11 :** లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా తీరుపై కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం న్యూఢిల్లీలో స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం సందర్భంగా లోక్ సభలో ఎంపీ మల్లు రవి మాట్లాడారు. పార్లమెంట్ సంస్థలు పార్టీల రాజకీయాలను మించి ఉండాలని అభిప్రాయపడ్డారు. సభలో పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వ లేదని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీల స్వరాలను అణచివేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.స్పీకర్ పదవి రాజకీయాలకు అతీతంగా ఉండాలని ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవి వ్యాఖ్యానించారు. మహిళా ఎంపీలపై స్పీకర్ ఓం బిర్లా చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు. మహిళా ఎంపీల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేశారంటూ ఎంపీ మల్లు రవి విమర్శించారు. ఎనిమిది మంది ప్రతిపక్ష ఎంపీలపై ఉన్న సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు లేవనెత్తినందుకే సదరు ఎంపీలను సస్పెండ్ చేశారని ఆరోపించారు. తెలంగాణ ఏర్పాటుపై చేసిన వ్యాఖ్యలను ఎంపీ మల్లు రవి ఖండించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటూ పూర్తిగా రాజ్యాంగబద్ధమేనని స్పష్టం చేశారు. ఫిబ్రవరి 14ను బ్లాక్ డే అనడం తప్పు అంటూ కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి పేర్కొన్నారు.

## ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై అభిసంశన

**తృణమూల్ కాంగ్రెస్ తీర్మానం..180 మంది సంతకాలు**

**న్యూఢిల్లీ,మార్చి11** పార్లమెంటు రెండో దఫా బడ్జెట్ సమావేశాలు మరోసారి వేడెక్కనున్నాయి. రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పై తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టనుంది. విపక్ష ’ఇండియా’ కూటమికి చెందిన 180 మంది ఎంపీలు ఇందుకు సంబంధించిన నోటీసుపై సంతకాలు చేసినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. వీరిలో 120 మంది లోక్‌సభ ఎంపీలు, 60 మంది రాజ్యసభ ఎంపీలు ఉన్నారు.ప్రతిపాదిత అభిశంసన తీర్మానంలో సీఈసీపై తృణమూల్ కాంగ్రెస్ పలు ఆరోపణలు చేసినట్టు తెలుస్తోంది. ఓటర్లను తమ ఓటు హక్కు వినియోగించుకోకుండా చేశారనేది ఆయనపై మెదటి ఆరోపణ. మార్చి 10వ తేదీన సమావేశమయ్యేందుకు ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యాలయానికి వెళ్లిన టీఎంసీ నేతల పట్ల సీఈసీ అనుచితంగా ప్రవర్తించారనేది రెండో ఆరోపణ. రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేశారనేది మూడో ఆరోపణ. అభిశంసన తీర్మానాన్ని ఉభయసభల్లోనూ ప్రవేశపెట్టాలని, ఈనెల 12న కానీ, 13న కానీ నోటీసు విపక్ష కూటమి తీర్మానాన్ని ఆమోదించినట్లయితే అభిశంసన ప్రొసీడింగ్స్‌ను ఎదుర్కొంటున్న తొలి సీఈసీ కూడా జ్ఞానేశ్ కుమార్ అవుతారు. 1990లో అప్పటి సీఈసీ టీఎన్ శేషన్, 2006లో నవీన్ చావ్లాపై అభిశంసన తీర్మానం పెట్టాలనే చర్చలు జరిగినప్పటికీ అవి కార్యరూపంలోకి రాలేదు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సిన తరుణంలో హడావిడిగా పశ్చిమబెంగాల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను చేపట్టడాన్ని మొదట్నించీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యతిరేకిస్తున్నారు. ఓటర్ల జాబితా రివిజన్ ప్రక్రియలో తీవ్రమైన అవకతవకలు జరిగాయంటూ ఈసీకి ఈవారం మొదట్లో టీఎంసీ లేఖ రాసింది. లక్షలాది మంది అర్హులైన ఓటర్లను ఎన్నికల జాబితా నుంచి తొలగించారని సీఎం ఆరోపించారు. ఎస్ఆర్ఐ ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం ఓటర్ల తుది జాబితాను ఫిబ్రవరి 28న ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. 5,46,053 మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించినట్టు ప్రకటించింది. దీనిపై మమతా బెనర్జీ నిరసనలకు దిగారు. కాగా, సీఈసీపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాలంటే లోక్‌సభలో 100 మంది ఎంపీలు, రాజ్యసభలో 50 మంది ఎంపీలు సంతకాలు చేయాలి. ఉభయసభల్లో ఎక్కడైనా తీర్మానాన్ని ప్రవేశపెట్టవచ్చు.

# మార్చి 15 నుంచి తెలంగాణలో భారీ వర్షాలు..

మార్చ్ 11 (జన సంఘర్షణ)




తెలంగాణలో మళ్లీ భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేశారు. మార్చి 15న ఉత్తర, మధ్య తెలంగాణలో వానలు కురుస్తాయని వెల్లడించారు. మార్చి 16 లేదా 17 నుంచి రాష్ట్రమంతటా వడగళ్లు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు పడుతాయని తెలిపారు. ఈ అకాల వర్షాల నేయపథ్యంలో రైతులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. మరోవైపు వారం నుంచి 3 రోజుల పాటు ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా ఉంటాయని హెచ్చరించారు. గత వాన కాలం సీజన్లు పంటలు చేతికి వచ్చే సమయంలో ఎడా తిరుప లేకుండా కురిసిన భారీ వర్షాల వల్ల తెలంగాణ రాష్ట్రంలో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో పూర్తిగా దిగబడును తగ్గిపోయాయి. ముఖ్యంగా వరి, పత్తి, సోయా పంటలు వేసినా రైతులు తీవ్రంగా నష్టాలకు గురయ్యారు. ఈ యాసంగి సీజన్ అయినా తమను అప్పుల బాధ నుంచి గట్టెక్కిస్తుందన్న గంపెడి ఆశలు పెట్టుకొని, అప్పులు చేసి మరి పంటలు సాగు చేయగా, ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా ఒకవైపు మొక్కజొన్న, మరొకవైపు వరి పొట్ట దశలోకి చేరుకుంది. ఇప్పుడిప్పుడే పొట్ట దశలో నుంచి ధాన్యం బయటకు వస్తుంది. ఈ సమయంలో వడగళ్ల వాన కురిస్తే వరి పంటకు తీవ్రంగా దెబ్బతినే అవకాశాలు ఉన్నాయంటూ అన్నదాత గుండెల్లో ఇప్పటి నుంచే రైలు పరిగెత్తుతున్నాయి. అకాల వర్షాలు తమని నిండా ముంచేయని, ఈ యాసంగి సీజన్ అయినా తమను అప్పుల బాధ నుంచి గట్టెక్కిస్తుందని ఎంతో ఆశతో ఉండగా ఈనెల 15 నుంచి తెలంగాణ రాష్ట్రంలో చిన్నపాటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణం హెచ్చరికలు అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తుంది.

# పొగాకు రహిత సమాజం కోసం మన సంకల్పం

హైదరాబాద్, మార్చి 11,(జన సంఘర్షణ):

పొగాకు వినియోగం నేటి ప్రపంచంలో ఒక పెద్ద ప్రజా ఆరోగ్య సమస్యగా మారింది. ప్రతి సంవత్సరం జరుపుకునే ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం మనకు ఒక ముఖ్యమైన సందేశాన్ని అందిస్తుం. మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మన చేతుల్లోనే ఉందని. అయినప్పటికీ సమాజంలో ఇంకా చాలామంది పొగాకు వల్ల కలిగే ప్రమాదాలను పూర్తిగా గ్రహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పొగాకు వినియోగం కేవలం ఒక వ్యక్తి ఆరోగ్యానికే కాదు, కుటుంబం మరియు సమాజానికి కూడా తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తుంది. సిగరెట్లు, బీడీలు, గుట్కా, ఖైనీ వంటి రూపాల్లో తీసుకునే పొగాకు అనేక ప్రాణాంతక వ్యాధులకు కారణమవుతోంది. ముఖ్యంగా క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలు వంటి అనారోగ్యాలు పొగాకు వినియోగంతో మరింత పెరుగుతున్నాయి. వైద్య నిపుణుల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం లక్షలాది మంది పొగాకు సంబంధిత వ్యాధుల వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు.యువతలో పెరుగుతున్న అలవాటు నేటి యువతలో పొగాకు వినియోగం పెరుగుతున్నది. ఒక ఆందోళనకర విషయం. ఆసక్తి, స్నేహితుల ప్రభావం లేదా ఫ్యాషన్‌గా భావించి ప్రారంభమయ్యే ఈ అలవాటు తరువాత వ్యసనంగా మారుతుంది. ఒకసారి అలవాటు పడితే దానిని మానడం చాలా కష్టమవుతుంది. అందుకే యువతలో ముందుగానే సరైన అవగాహన కల్పించడం చాలా అవసరం. చట్టాలు ఉన్నా చైతన్యం అవసరం పొగాకు నియంత్రణ కోసం ప్రభుత్వం అనేక చట్టాలను అమలు చేస్తోంది. ప్రజా ప్రదేశాల్లో పొగ త్రాగడాన్ని నిషేధించడం, పొగాకు ఉత్పత్తులపై ఆరోగ్య హెచ్చరికలు ముద్రించడం, ప్రకటనలను నియంత్రించడం వంటి చర్యలు తీసుకుంటోంది. అయినప్పటికీ చట్టాలతో పాటు ప్రజల్లో చైతన్యం కూడా అవసరం. పాఠశాలలు, కళాశాలలు,మీడియా మరియు సామాజిక సంస్థలు కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. పాసివ్ స్మోకింగ్ కూడా ప్రమాదమే. పొగాకు వాడే వ్యక్తి మాత్రమే కాదు, అతని చుట్టూ ఉన్నవారు కూడా ప్రమాదంలో పడతారు. పక్కవాళ్లు పీల్చే పొగను పాసివ్ స్మోకింగ్ అంటారు. ఇది కూడా ఆరోగ్యానికి తీవ్రమైన హానిని కలిగిస్తుంది. అందువల్ల పొగాకు వినియోగం తగ్గించడం సమాజం మొత్తం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. మనందరి బాధ్యత పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ ఒక సంకల్పం తీసుకోవాలి. తాము పొగాకు వాడకపోవడం మాత్రమే కాదు, ఇతరులను కూడా ఆ అలవాటుకు దూరంగా ఉంచాలని. ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణానికి ఇది ఒక ముఖ్యమైన అడుగు."పొగాకు క్షణిక ఆనందాన్ని ఇస్తుంది, కానీ జీవితకాల అనారోగ్యాన్ని మిగులుస్తుంది. ఆరోగ్యమే నిజమైన సంపద. స్లోగన్లు "పొగాకు వదిలేయండి, ఆరోగ్యాన్ని అలవరచుకోండి." "పొగాకు లేని జీవితం- ఆరోగ్యమైన భవిష్యత్తు."



**-టి. లక్ష్మణ్ గౌడ్, (సీనియర్ హైకోర్ట్ అడ్వకేట్) మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.**


# ఏహెచ్‌టీయు బృందం స్పాపై కూకట్‌పల్లి పోలీసులు దాడి


❑ **6 మంది బాధితులు.**

హైదరాబాద్ మార్చి 11,(జన సంఘర్షణ):

కూకట్‌పల్లి నియోజకవర్గం భాగ్యనగర్‌లోని చార్మ్ బ్యూటీ స్పా, స్పా సేవల ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది.ఈ దాడిలో, రిసెప్షన్ కౌంటర్ వద్ద ఇద్దరు మహిళలు, ఒక పురుషుడిని పోలీసులు కనుగొన్నారు, వారు నిర్వాహకులని వెల్లడించారు. మహిళా పోలీసు సిబ్బంది సహాయంతో, గదులను తనిఖీ చేశారు. ఆరుగురు మహిళా బాధితులను రక్షించారు. ఒక గదిలో ఒక పురుష కస్టమర్ కూడా ఉన్నట్లు కనుగొనబడింది. నిందితులను ఈ క్రింది విధంగా గుర్తించారు.పైడుముల దివ్య (31) – ఆర్గనైజర్, జగత్గిరిగుట్ట, భీమడోలు, పశ్చిమ గోదావరి అల్వాల సంగీత మాధురి (36) – సబ్-ఆర్గనైజర్, ఆర్/ఓ మలక్‌పేట, హైదరాబాద్, జయప్రకాష్ (25) – సబ్-ఆర్గనైజర్, వడ్లపూడి, గుంటూరు ఈ దాడిలో, సంఘటన స్థలం నుండి 04 స్మార్ట్ మొబైల్ ఫోన్లు, రూ. 9,100 నగదు, 07 కండోమ్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి దర్యాప్తు జరుగుతోంది. స్పా లేదా వెల్‌నెస్ సేవల ముసుగులో వ్యభిచారం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను నిర్వహిస్తున్న వారిపై చట్ట ప్రకారం కఠినంగా వ్యవహరిస్తామని కూకట్‌పల్లి పోలీసులు స్పా, మసాజ్ సెంటర్ యజమానులకు గట్టి హెచ్చరిక జారీ చేశారు. అన్ని స్పా, మసాజ్ సెంటర్ యజమానులు సంబంధిత అధికారుల నుండి చెల్లుబాటు అయ్యే లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్‌లు, ఇతర అవసరమైన ధృవపత్రాలను కలిగి ఉండాలని ఆదేశించారు. ఏదైనా స్పా లేదా మసాజ్ సెంటర్ చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినట్లు లేదా చెల్లుబాటు అయ్యే అనుమతులు, ధృవపత్రాలు లేకుండా పనిచేస్తున్నట్లు తేలితే, కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటారు . సంబంధిత విభాగాల ద్వారా సంస్థలను మూసివేస్తారు. స్పాలు, మసాజ్ సెంటర్లు, లాడ్జీలు లేదా ఇతర సంస్థలలో అనుమానాస్పద లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలు కనిపిస్తే పోలీసులకు తెలియజేయాలని కూకట్‌పల్లి పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.








# ఆస్తి కోసం కన్నతల్లిని ఇబ్బంది పెడుతున్న కొడుకు

❑ **బాధితురాలికి అండగా నిలిచిన దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ మార్చి11(జన సంఘర్షణ)



భద్రాద్రికొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం నరసింహసాగర్‌కు చెందిన దంసలపూడి పద్మ అనే మహిళను తన కొడుకు నాగరాజు ఆస్తి కోసం కొడుతూ తిడుతూ ప్రతిరోజు ఇబ్బంది పెడుతున్నాడు. ఇబ్బందులు తట్టుకోలేక ఆ మహిళ దిశ ప్రొటెక్షన్ టౌన్ అధ్యక్షురాలు అరుణను ఆశ్రయించింది. దిశ ప్రొటెక్షన్ ఫౌండేషన్ చైర్మన్ బీవీ రాజు, ఉపాధ్యక్షులు కళ్యాణి, జిల్లా అధ్యక్షురాలు పూజల లక్ష్మీ, జిల్లా జనరల్ సెక్రెటరీ పిట్టల కమలమ్మ సూచనతో టౌన్ అధ్యక్షురాలు బొల్లం అరుణ ఆధ్వర్యంలో బాధిత మహిళ దంసలపూడి పద్మతో మాట్లాడిన సభ్యులు ఆమె సమస్యను తెలుసుకుని సుజాతనగర్ పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఎస్సై రమాదేవిని కలిసి పద్మ న్యాయం జరిగేలా చూడాలని మాట్లాడి బాధితురాలు కొడుకుపై ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో రుద్రంపూర్ మండల ప్రెసిడెంట్ దేవరపల్లి రజిని, జగన్నాథపురం మండల ప్రెసిడెంట్ గడ్డం జ్యోతి, టౌన్ వైస్ ప్రెసిడెంట్ మందకృష్ణ వేణి, దిశా సభ్యురాలు బిందు పాల్గొన్నారు.

# జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ..

రామ రెడ్డి:మార్చ్ 11 (జన సంఘర్షణ)



మండలంలోని అన్నారం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆర్యభట్ట విద్యా సంస్థల ఆధ్వర్యంలో సుమారు రూ.10వేల విలువ గల పరీక్షల సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేశిరెడ్డీ గురువేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశలో పదో తరగతి ఎంతో కీలకమైనదని విద్యార్థులందరూ కష్టపడి చదివి పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ హన్మంత రావు మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి భయం లేకుండా పరీక్షలకు హాజరుకావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కృష్ణ ప్రసాద్, పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన మంచినీటి పైప్ లైన్ పనులను పరిశీలించిన గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్

హైదరాబాద్ సిటిబ్యూరో /మార్చ్ 11(జనసంఘర్షణ )



గాంధీనగర్ డివిజన్‌లోని మలయాళం చర్చ్ రోడ్డు, అశోక్ నగర్ ప్రాంతాల్లో రూ. 12 లక్షల నిధులతో గతంలో ప్రారంభించుకున్నా నూతన మంచినీటి పైప్ లైన్ పనులను బుధవారం గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ వాటర్ వర్క్స్ అధికారులు డిజిఎం వెంకట్ రెడ్డి, మేనేజర్ శివకుమార్ వర్క్ ఇన్స్పెక్టర్ శంకర్, బిజెపి నేతలతో కలిసి పరిశీలించారు. మంచినీటిలో ప్రెషర్ సమస్యను పరిష్కరించే దిశగా చేపట్టిన నూతన పైప్ లైన్ పనుల్లో నాణ్యతను పాటించి వేగవంతంగా పనులు పూర్తి చేయాలని అధికారులను కోరారు. మెరుగైన మంచినీటి సరఫరాను డివిజన్ ప్రజలకు అందించాలనే ముఖ్య ఉద్దేశంతో పనులు కొనసాగుతున్నాయని మాజీ కార్పొరేటర్ వివరించారు. కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, బిజెపి సీనియర్ నాయకులు శ్రీకాంత్, విష్ణు ప్రసాద్, ఎం.ఉమేష్, శ్రీనివాస్ యాదవ్, ఆనంద్ రావు, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# అరేపల్లి గ్రామంలో జాతీయ పశు వ్యాధి నియంత్రణ..

రాజంపేట :మార్చ్ 11 (జనసంఘర్షణ)



రాజంపేట్ మండలంలోని అరేపల్లి గ్రామంలో జాతీయ పశు వ్యాధి నియంత్రణ కార్యక్రమం (ఎన్ఏడీసీపీ) కింద గాలికుంటు వ్యాధి (ఫుట్ అండ్ మౌత్ డిసీసీ-ఎఫ్ఎండీ) టీకా శిబిరం నిర్వహించినట్లు మండల పశు వైద్యాధికారి అనిల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ రోజా కృష్ణారావు గ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ శిబిరంలో సుమారు 100 పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయబడినవి. టీకాలు వేసిన పశువుల వివరాలను ఎండీఎల్ఎం/ భారత్ పశుధాన్ ఆప్‌లో నమోదు చేసి ధృవీకరించబడిందన్నారు. పశువులలో గాలికుంటు వ్యాధి నివారణకు రైతులు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులు రైతులకు సూచించారు. ఈ శిబిరంలో డా.బి.మోనికా రెడ్డి, డా.అనిల్ రెడ్డి, సిబ్బంది రాజ్‌వీరయ్య, రాజేశ్వర్ (ఓఎస్), గోపాలమిత్ర రమేష్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# ప్రేమ నేర్పుతుంది

హైదరాబాద్, మార్చి 11(జన సంఘర్షణ):



ప్రేమ మనసుకు భావాలను నేర్పుతుంది.
విద్య జీవితానికి దిశను చూపిస్తుంది.
జర్నలిజం విద్యార్థికి నేర్పేది ఏమిటంటే...
నిజాన్ని వెతికే కలం ఎంత ముఖ్యమో
జీవితాన్ని అందంగా మలిచే
ప్రేమ కూడా అంతే ముఖ్యం
ప్రేమ హృదయాన్ని పెంచుతుంది.
విద్య భవిష్యత్తును నిర్మిస్తుంది.

**-ఏమ్మడి సుధీర్ కుమార్ (హైకోర్ట్ అడ్వకేట్ ) మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ, హైదరాబాద్.**

# రాజ్యసభకు ఎన్నికైన వేమ్ నరేందర్ రెడ్డిని కలసి అభినందించిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

11. మార్చ్... జన సంఘర్షణ



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా..ప్రభుత్వ సలహాదారు వేమ్ నరేందర్ రెడ్డి రాజ్యసభకు ఎన్నికైన సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నివాసంలో కూనంనేని సాంబశివరావు పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారానికి రాజ్యసభలో సమర్థంగా సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెళ్లిరోజు సందర్భంగా కెసిఆర్‌ను కలిసి ఆశీస్సులు తీసుకున్న దిండిగల రాజేందర్ దంపతులు





భద్రాద్రి కొత్తగూడెం. ఇల్లెందు ప్రతినిధి :(జన సంఘర్షణ )

తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కె.చంద్రశేఖర్ రావుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాజీ గ్రంథాలయాల చైర్మన్, తెలంగాణ ఉద్యమ నాయకులు దిండిగల రాజేందర్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. తమ పెళ్లిరోజు సందర్భంగా హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసిన దిండిగల రాజేందర్ దంపతులు పూలగుచ్ఛం అందజేసి కెసిఆర్‌కి అభివాదం చేశారు. ఈ సందర్భంగా కె. చంద్రశేఖర్ రావు దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలుపుతూ వారు ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కుటుంబ జీవితంలో పరస్పర గౌరవం, ప్రేమాభిమానాలు ఎంతో ముఖ్యమని సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ కాలంలో దిండిగల రాజేందర్ చేసిన సేవలను కెసిఆర్ గుర్తు చేసుకున్నారు. తెలంగాణ సాధన కోసం ఎన్నో కష్టాలు భరించి ఉద్యమంలో ముందుండి పనిచేసిన నాయకులలో రాజేందర్ ఒకరని ప్రశంసించారు. ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజల కోసం పనిచేయాలని, సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. దీనిపై దిండిగల రాజేందర్ మాట్లాడుతూ, కెసిఆర్‌ని పెళ్లిరోజు సందర్భంగా కలిసి ఆశీస్సులు పొందడం తమ జీవితంలో ఒక ప్రత్యేకమైన సందర్భంగా భావిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కెసిఆర్ చేసిన త్యాగాలు, పోరాటం ఎల్లప్పుడూ తమకు ఆదర్శమని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని, ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తామని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రజా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ పేదల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని రాజేందర్ వెల్లడించారు. సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం తాము ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తామని చెప్పారు. ఈ భేటీ ఎంతో ఆత్మీయ వాతావరణంలో సాగింది. ఈ సందర్భంగా అక్కడున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా దిండిగల రాజేందర్ దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. వారి దాంపత్య జీవితం ఆనందంగా, సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం సందర్భంగా పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొని దిండిగల రాజేందర్ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేయడం విశేషంగా నిలిచింది.

## ఉరి వేసుకుని ఆత్మహత్య..

మార్చ్ 11 (జన సంఘర్షణ)



ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధ తాళలేక బాన్సువాడ మండలం బోర్లం గ్రామానికి చెందిన ఫోటోగ్రాఫర్ మన్నె గంగాధర్ (33) బుధవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మద్యానికి బానిసైన ఆయన అప్పులు ఎక్కువ కావడంతో ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళ భద్రత, వేధింపుల నివారణ కోసం షీ టీమ్స్ : ఎస్ఐ సునీల్

మార్చు 11 జన సంఘర్షణ




మహిళల భద్రత, వేధింపుల నివారణ కోసం 24 /7 పని చేస్తుందని ఎస్ఐ సునీల్ అన్నారు. బుధవారం నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో విద్యార్థులకు షి టీమ్స్ ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈవ్‌టీజింగ్, వేధింపులకు పాల్పడి వారిని పట్టుకోవడం కౌన్సిలింగ్ ఇవ్వడం చట్టపరమైన చర్య తీసుకోవడం అలాగే బడులు, కళాశాలలో అవగాహన కార్యమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. షీటీమ్స్ బహిరంగ ప్రదేశాలు, బస్ స్టాప్ లో, కాలేజీల వద్ద మహిళను వేధించవారిని సివిల్ డ్రెస్‌లో ఉండి పట్టుకుంటారన్నారు. బాల్య వివాహాలను అడ్డుకోవడంలో షీ టీమ్స్ చురుకుగా వ్యవహరిస్తుందన్నారు. సైబర్ నేరాలు పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్స్ ఏఎస్ఐ ఆశయ్య, రేణుక, ఉపాధ్యాయులు బర్ల సాయిలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్.పి.వి.టీకా కార్యక్రమం ప్రారంభం..

- క్యాన్సర్ రహిత సమాజం కోసం బాలికలకు టీకాలు
- ముఖ్య అతిథులుగా తిరుపతి పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు మట్టం శ్రావణి, ఏ.యం.సి డైరెక్టర్ మల్లి శ్యామల
- జ్ఞాపకార్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కల నాటడం

మనుబోలు. మార్చ్ 11 (జన సంఘర్షణ)



నెల్లూరు జిల్లా. గూడూరు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హెచ్.పి.వి.(హ్యూమన్ పాపిల్లోమా వైరస్) టీకా కార్యక్రమం బుధవారం గూడూరు మండలం, చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అత్యంత ఘనంగా ప్రారంభమైంది. చెన్నూరు పిహెచ్‌సి వైద్యధికారి డాక్టర్ ఎం. జ్యోతి సూచనల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి తిరుపతి పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు మట్టం శ్రావణి, మల్లి శ్యామల ముఖ్య అతిథులుగా విచ్చేసి, తమ చేతుల మీదుగా 14 సంవత్సరాల లోపు బాలికలకు టీకాలను వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అవగాహన మరియు ప్రయోజనాలు:ఈ సందర్భంగా మట్టం శ్రావణి, వైద్యధికారి డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ.. భవిష్యత్తులో మహిళలకు వచ్చే గర్భాశయ క్యాన్సర్ నివారణకు ఈ హెచ్.పి.వి.టీకా ఎంతో మేలు చేస్తుందని వివరించారు. ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి బాలికకు ఈ టీకా అందేలా చూడాలని పిలుపునిచ్చారు.పర్యావరణ స్పృహ: ఈ కార్యక్రమ జ్ఞాపకార్థం టీకా లాంచింగ్ డే గుర్తింపుగా, అతిథులు శ్రీమతి మట్టం శ్రావణి, మల్లి శ్యామల ఆరోగ్య సిబ్బంది సహకారంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు ఆరోగ్య కేంద్రం సిబ్బంది మస్తానయ్య, గడ్డం నాగేశ్వరరెడ్డి, సంపూర్ణమ్మ (ఎంపీహెచ్ ఎస్) ఉమ, అరుణ, వరప్రసాద్ (ఎం.పీ.హెచ్ యో) లతో పాటు ఆశా కార్యకర్తలు, ఏ.యన్.యం.లు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మార్చ్ 13న దిల్సుక్ నగర్‌లో జరిగే నిరుద్యోగ మార్చ్‌కి నిరుద్యోగులందరూ కదలిరండి

- నిరుద్యోగ జేఏసీ నేతలు కిరణ్ రాథోడ్, కయ్యు వెంకటేష్....

హైదరాబాద్ సిటిబ్యూరో/ మార్చ్ 11 ( జనసంఘర్షణ )



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచిపోతున్న నిరుద్యోగులకు ఇచ్చిన ఒక్క హామీ నెరవేర్చకుండా ప్రశ్నించిన నిరుద్యోగులను నిర్బంధలకు గురిచేస్తూ అణచివేసే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి నిరుద్యోగులం బుద్ధిచెబుతం.ఖచ్చితంగా ఉద్యోగ నోటిఫికేషన్లు సాధించుకునేదాకా మేం పోరాడుతాం.మార్చ్ 13న జరిగే నిరుద్యోగ మార్చ్ కి ప్రతి నిరుద్యోగి కదలిరావాలి 16నుండి జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగుల అంశాలను మాత్రమే చర్చించి కాళిగా ఉన్న ఉద్యోగ నోటిఫికేషన్లని విడుదల చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేూజ నేతలు కిరణ్ రాథోడ్. సురేష్. కుమార్. శ్రీను రాథోడ్. ప్రవీణ్ వెంకట్ గౌడ్ పాల్గొన్నారు.

## యువతీ యువకులకు వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమం

- 73 రోజులపాటు నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్,కడా సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ.
- కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ పీడీ వికాస్ మర్మత్.




కుప్పం, మార్చ్ 11 (జన సంఘర్షణ)

నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో యువతి యువకులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. బుధవారం ఈ మేరకు వివరాలను పత్రికల వారికి తెలిపారు. యువతీ యువకులకు 73 రోజులపాటు ఈ శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. కుప్పం నియోజకవర్గంలో దాదాపు 20 పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని, కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అవసరమైన శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ తర్వాత సర్టిఫికెట్లను ఇవ్వడం జరుగుతుందని 100 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. సోలార్ డొమెస్టిక్ ప్రోడక్ట్ అసెంబ్లర్, క్లౌడ్ అప్లికేషన్ డెవలపర్, వెబ్ డెవలపర్, ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ ప్రాక్టీషనర్, ఎలక్ట్రానిక్ హార్డ్వేర్ అసెంబ్లీ ఆపరేటర్ అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. 18 నుంచి 45 సంవత్సరాల వయసు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 63019 94961 , 70137 01423, 96035 43211 నెంబర్లను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## ప్రభుత్వ ఆస్తులను గుర్తించి పరిరక్షించండి

- బిజెపి.. జనసేన పార్టీ నేతలు డిమాండ్

రామకుప్పం మార్చ్ 11 (జన సంఘర్షణ)

రామకుప్పం మేజర్ పంచాయతీ పరిధిలోనున్న ప్రభుత్వ ఆస్తులను గుర్తించి ఆక్రమణ నుండి పరిరక్షించాలని బిజెపి, జనసేన పార్టీ నేతలు బుధవారం తాసిల్దార్‌కు ఫిర్యాదు చేశారు వివరాలు ఇలా ఉన్నాయి. రామకుప్పం సమీపంలోనున్న జగనన్న కాలనీలో చోటుచేసుకున్న అవుకే తవ్వకాలను గుర్తించాలన్నారు. ఇందులో జరిగిన అవినీతి అక్రమాలను వెలికి తీసి అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని వారు పేర్కొన్నారు



. అదేవిధంగా కల్లుగీత కార్మిక కాలనీలో కబ్జాకు గురైన స్థలాలను గుర్తించాలన్నారు. బంధార్లపల్లి గ్రామం నుండి బీసీ స్మశాన వాటిక మీదుగా నాగమ్మ చెరువుకు వచ్చే సప్లై ఛానల్ ఆక్రమణకు గురైందని పేర్కొన్నారు. అదేవిధంగా స్థానిక వైఎస్ఆర్ సర్కిల్ నుండి వీకోట వెళ్లే రోడ్డు మార్గానికి 20 ప్రస్తాపరంబోకు ఆక్రమణకు గురైందన్నారు. రామకుప్పం పెద్ద చెరువు సర్వే చేసి ఆక్రమణలను తొలగించాలని పేర్కొన్నారు. హంద్రీనీవా కాలువ ద్వారా ప్రతి చెరువుకు నిర్వహించే చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు . అదేవిధంగా మిట్టపల్లి వద్దనున్న పూలకుంట చెరువు ఆక్రమణలను తొలగించాలన్నారు. ప్రభుత్వ ఆస్తులను గుర్తించి ఆక్రమణ తొలగించిన అనంతరం బోర్డులను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు డాక్టర్ ఆంజనేయప్ప, రాజసింహ, బి నాగరాజు, జనార్ధన్ రెడ్డి, మండల జనసేన పార్టీ అధ్యక్షులు హరీష్, ప్రధాన కార్యదర్శి గజేంద్ర తదితరులు ఉన్నారు.

## జాతీయస్థాయి మెరిట్ స్కాలర్షిప్‌కు ఎంపికైన కేడీసీ విద్యార్థినులు




కుప్పం, మార్చ్ 11 (జన సంఘర్షణ)

కుప్పం డిగ్రీ కళాశాలలో సెకండ్ ఇయర్ బి.సి.ఎ చదువుతున్న కె.అఫ్రీన్ తాజ్, బి.బి.ఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎం.సింధు అనే విద్యార్థినులు ఎ.ఐ.సి.టి.ఇ సరస్వతి మెరిట్ స్కాలర్షిప్‌కు ఎంపికైనట్లు కళాశాల వైస్ చైర్మన్ యం.సాగర్ రాజు తెలిపారు.ఎంపికైన విద్యార్థినులను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డి. సుధారాణి అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి దేవస్థానంకు విచ్చేసిన విధుశేఖర భారతి మహాస్వామిజీ

శ్రీకాళహస్తి మార్చ్ 11( జన సంఘర్షణ)

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానంకు జగద్గురు విధుశేఖర భారతి మహాస్వామి జీ, జగద్గురు మహా సంస్థానం శృంగేరి పీఠం వారు బుధవారం ఉదయం 9.45 గంటలకు శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దర్శనార్థం ఇచ్చేసారు. జగద్గురు విధుశేఖర భారతి మహాస్వామి జీ,జగద్గురు మహా సంస్థానం శృంగేరి పీఠం వారిని ఆలయ మొదటి గోపరమైన భిక్షాల గోపురం దగ్గర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొట్టే సాయిప్రసాద్, ఆలయ కార్యనిర్వాహణాధికారి బి కే వెంకటేశు లు వారిని సాదరంగా ఆహ్వానించి వారికి శ్రీస్వామి అమ్మ వార్ల అభిషేకము, దర్శనము ఏర్పాటు అనంతరం వేద ఆశీర్వచనం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొట్టే సాయిప్రసాద్, ఆలయ కార్యనిర్వాహణాధికారి బికె వెంకటేశులు, ఆలయ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు గుర్రప్ప శెట్టి, గోపీనాథ్, పగడాల మురళి, లక్ష్మమ్మ, సావిత్రి, ప్రధాన అర్చకులు సంబంధం, గురుకుల్ కరుణాకర్ గురుకుల్, ఆలయ ఏఈఓలు విద్యాసాగర్ రెడ్డి, ప్రోటోకాల్ మోహన్, హేమామాలిని, లోకేష్ బాబు, పర్యవేక్షకులు నాగభూషణం, శ్రీహరి, ఆలయ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి, వేద పండితులు అర్చకులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత

కుప్పం,మార్చ్ 11( జన సంఘర్షణ)




పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని, అందుకు వ్యర్థాలను సమర్థవంతంగా నిర్వహించాలని కుప్పం మున్సిపల్ కమిషనర్ వి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ వి. శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది ప్రతినిత్యం ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. బుధవారం కూడా ఈ కార్యక్రమాన్ని మునస్వామి పురం బీసీ కాలనీ, స్థానిక పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు విద్యార్థులకు వ్యర్థాల నిర్వహణపై తగు సూచనలు చేశారు. తడి పొడి చెత్తలను వేరువేరుగా ఇండ్లలో ఉంచుకోవాలని వాటిని మున్సిపల్ సిబ్బంది చెత్త సేకరణకు వచ్చే సందర్భంగా ఇవ్వాలని కోరారు. వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. తడి పొడి చెత్తలను వేరువేరు డబ్బాలలో వేసి మున్సిపల్ వాహనాలలో ఇవ్వాలన్నారు. తడి చెత్త నుండి ఎరువులు, పొడి చెత్త నుండి రీసైక్లింగ్ ఉత్పత్తులు తయారు కాగలవన్నారు. మిగిలిపోయిన ఆహారం, పండ్లు, కూరగాయలు, తొక్కలు, కుళ్ళిన కూరగాయలు, ఆకులు, గుడ్లు పెంకులు, టీ పొడి ఒక డబ్బాలో ఉంచుకోవాలన్నారు. వీటి ద్వారా కంపోస్ట్ ఎరువు తయారీ లేదా బయోగ్యాస్ ఉత్పత్తికి ఉపయోగించుకునే అవకాశం ఉందన్నారు. ప్లాస్టిక్ కాగితం కార్గోస్ లోహాలు, గాజులు దుస్తులు వేరుగా ఉంచాలన్నారు. వీటిని పునర్వినియోగం కేంద్రాలకు పంపవచ్చు అన్నారు. ఇళ్లలోనే చెత్తను రెండుగా వేరు చేయాలన్నారు. ముఖ్యంగా ప్రమాదకర వ్యర్థాలు, బల్బులు, బ్యాటరీలు, మందులు ప్రత్యేక డబ్బాలో ఉంచాలన్నారు.అన్ని కలపడం వల్ల రీసైక్లింగ్ కష్టమవుతుందని, పర్యావరణ కాలుష్యం పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ కాలనీ ప్రజలు,పాఠశాలలో విద్యార్థులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కృషి

కుప్పం,మార్చ్ 11( జన సంఘర్షణ)



పర్యావరణ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ విప్, కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ సలహా మండలి పొలిటికల్ చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఏపీ వజ్రావేలు శెట్టి వీధిలోని శ్రీ ప్రియ నర్సింగ్ హోమ్ వద్ద ఈ సైకిల్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. శ్రీ ప్రియ నర్సింగ్ హోమ్ లోని ఉద్యోగులకు నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ డి సుధీర్ ఈ సైకిల్ లను అందజేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనల మేరకు పర్యావరణ కాలుష్య నియంత్రణకు ఈ సైకిల్ ఉద్యమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుతో ఇప్పటికే ముఖ్యమంత్రి చేతుల మీదుగా 5,555 ఈ సైకిల్లను పంపిణీ చేయడం కూడా చేపట్టడం జరిగిందన్నారు. ఈ అంశం గిన్నిస్ బుక్ రికార్డులో స్థానం తక్కించుకుందన్నారు. రాష్ట్రాన్ని నెట్ జీరో రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకుంటున్నారన్నారు. గ్లోబల్ వార్మింగ్ ను1.5 డిగ్రీల సెల్సియస్ కి పరిమితం చేసి విపత్కర వాతావరణ మార్పులను నివారించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నది అన్నారు. బొగ్గు, చమురు వాడకాన్ని తగ్గించడం పునరుత్పాదక ఇందన వనరులైన సౌర, పవన విద్యుత్ ఉపయోగించడం, అడవుల పెంపకం వంటి చర్యలు చేపట్టడం కు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతునందన్నారు. కార్యక్రమంలో నాయకులు మునిరత్నం, సురేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ వి. శ్రీనివాసరావు, ప్రియా నర్సింగ్ హోమ్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రియా, స్థానిక కౌన్సిలర్లు, పలువురు టిడిపి నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఈ సైకిళ్లతో ర్యాలీ: స్థానిక శ్రీ ప్రియ నర్సింగ్ హోమ్ ఉద్యోగులకు ఈ సైకిల్ లను డాక్టర్ డి.సుధీర్, ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ డి సుధీర్, ఉద్యోగులు కుప్పం ప్రధాన వీధిలో సైకిళ్లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకటేష్, సోమశేఖర్, కన్నన్, శ్యామ్, గోపీనాథ్, సూర్య ప్రకాష్, వేలు, మంజునాథ్,సెల్వ రాజు, బాబు నాయుడు, జాకీర్ ,ఎంఆర్ సురేష్, గుడిపల్లి సుబ్బు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## కొడిచెర్ల శివారులో పచ్చిమిర్చి తోట పరిశీలించిన ఏపీ డి మేడం ..

మార్చ్ 11 (జన సంఘర్షణ)

భారతి మిర్చి తోటను పరిశీలించి సకాలంలో పంట పరిసరాలను ఎప్పటికీ ఆర్టికల్చర్ హారతి మేడం కెవికె సాయి చరణ్ హార్టికల్చర్ ఆఫీసర్ వహీద్ వైరస్ రాకుండా వాడిన మందుల గురించి అడిగి తెలుసుకున్నారు. తోట యజమాని వర్ణి శంకర్ కొన్ని సంవత్సరాలుగా పచ్చిమిర్చి సాగు చేస్తూ లావా సాటిగా మంచి తోట లాభాలలో ఉన్నాయని అన్నారు . కొడిచెర్ల గ్రామ ప్రజలు ఈ సదస్సులు పాల్గొన్నారు. పచ్చిమిర్చిలను సాగు చేసే విధానంపై రైతులు అవగాహన సదస్సు, రైతులకు పచ్చిమిర్చి పంట గురించి రైతులకు తెలియజేశారు మిర్చి తోటపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కొడిచెర్ల సర్పంచ్ కవిత, ఇరువంత్ మాజీ సర్పంచ్, వర్ని శంకర్ పచ్చిమిర్చి సాగు పై ఎన్నో సంవత్సరాలుగా సాగు చేస్తూ మిర్చి పంటను పండిస్తూ లాభసాటిగా ఉన్నదని రైతులకు తెలియజేశారు. హెచ్ఓ వహీద్ ఎల్లవేళలా తోటమాలి రైతులకు అందుబాటులో ఉంటూ సేవ అందించినందుకు వర్ణిశంకర్ రుద్రూర్ సైన్స్ విజ్ఞాన కేంద్రం రుద్రూరు హెచ్ఓ కు అభినందనలు తెలియజేశారు. కొడిచెర్ల కాంగ్రెస్ అధ్యక్షులు నీతి నగేష్ అంగర్గా ఇరుగొండ రైతులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తోటను పరిశీలించారు. మిర్చి తోటను పరిశీలించి సకాలంలో పంట పరిసలను ఏపీ డి హార్టికల్చర్ భారతి, కెవికె సాయి చరణ్ , హార్టికల్చర్ ఆఫీసర్ వహీద్ వైరస్ రాకుండా వాడిన మందుల గురించి అడిగి తెలుసుకున్నారు. తోట యజమాని వర్ణిశంకర్ కొన్ని సంవత్సరాలుగా పచ్చిమిర్చి సాగు చేస్తూ లాభసాటిగా మిర్చి తోట లాభాలలో ఉన్నాయని ఉన్నారు. కొడిచర్ల గ్రామ ప్రజలు పచ్చిమిర్చిలను సాగు చేసే విధానంపై రైతులు అవగాహన సదస్సులో రైతులకు తెలియజేశారు. మిర్చి తోటపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కోడిచర్ల సర్పంచ్ కవిత, ఇరువంత్ మాజీ సర్పంచ్ వర్ని శంకర్ పచ్చిమిర్చి



సాగుపై ఎన్నో సంవత్సరాలుగా సాగు చేస్తూ మిర్చి పంటపై రైతులకు అవగాహన కల్పించిన వర్ని శంకర్‌కు రైతులు అభినందనలు తెలియజేశారు. హెచ్ఓ వహీద్ ఎల్లవేళలో తోటమాలి రైతులకు అందుబాటులో ఉంటూ సేవ అందించినందుకు వర్ణిశంకర్ రుద్రూర్ సైన్స్ విజ్ఞాన కేంద్రం రుద్రూర్ హెచ్ ఓ కు అభినందనలు తెలియజేశారు. కోడిచెర్ల కాంగ్రెస్ అధ్యక్షులు మేత్రి నగేష్ నాగేష్ హంగర్‌గా ఇరుగొండ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బస్టాండ్ స్థలం సర్వే నిర్వహించిన అధికారులు..


మార్చ్ 11 (జన సంఘర్షణ)



వర్ని మండల కేంద్రంలోని బస్టాండ్ స్థలాన్ని రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. స్థానిక గ్రామపంచాయతీ సులబ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణం పై ఆర్టిసి అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీంతో స్థలం సర్వేకి మీరు ఏర్పాట్లు చేశారు. బుధవారం సర్వే నిర్వహించారు. సర్వేయర్ చందు, నీటి పారుదల శాఖ వర్క్ ఇన్స్పెక్టర్ ప్రకాష్‌లు సర్వే నిర్వహించారు. ఈ సర్వేని సర్పంచ్ కనకదుర్గా, రవి , ఉపసర్పంచ్ రాంబాబు, వార్డు సభ్యులు బాలయ్య, రాజు శంకర్ లు పరిశీలించారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న పోచారం భాస్కర్ రెడ్డి..

మార్చ్ 11 (జన సంఘర్షణ)



హైదరాబాద్, ఉప్పల్ లోని పళని కన్వెన్షన్‌లో మోస్రా మండల మాజీ ఎంపీపీ పిట్ల శ్రీరాములు బావమరిది బొగ్గుల శ్రీనివాస్ కుమార్తె అఖిల వివాహ విందుకు మోస్రా మండల నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి హాజరై నూతన వధూవరులు అఖిల - సాయి శరత్ బాబు లను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి.

## త్వరలో సిడ్ ఫామ్ భూములను సర్వే చేపడతాం

◆ సబ్ కలెక్టర్ కిరణ్మయి..

మార్చ్ 11( జన సంఘర్షణ)

కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ ఆదేశాల మేరకు బుధవారం నసుర్లాబాద్ మండలంలోని బొప్పాస్ పల్లి గ్రామంలోగల సీడ్ ఫామ్ భూములను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కొప్పిశెట్టి కిరణ్మయి మాట్లాడుతూ ప్రస్తుతం సాగులో ఉన్న రభీ పంట సీజన్ పూర్తయిన వెంటనే అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో సర్వే చేపడతామని అన్నారు. గ్రామంలో సీడ్ ఫామ్ భూములను కబ్జా చేసుకున్న వారివి అలాగే రైతులు సాగు చేస్తున్న భూములను పూర్తిస్థాయిలో పరిశీలించి వివరాలను నమోదు చేస్తామని చెప్పారు. సర్వే పూర్తయ్యే వరకు ఎలాంటి నిర్ణయాలకు రావద్దని రైతులకు కబ్జాదాలకు సూచించారు. సర్వే పూర్తయిన వెంటనే పట్టాలు వస్తాయని భావించకూడదని ఆమె తెలిపారు, తెలంగాణ ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనల మేరకు ప్రణాళికను అమలు చేస్తామని ప్రతి రైతుకు న్యాయం జరిగే విధంగా న్యాయం చేస్తామని అన్నారు. సీడ్ ఫామ్ భూములపై క్షేత్రస్థాయిలో సర్వే చేయకుండా జిల్లా అధికారులకు ప్రభుత్వానికి ఏలాంటి నివేదికను అందజేయలేమని తెలిపారు. ముందుగా సర్వే పూర్తయ్యేలా సహకరించాలని గ్రామ ప్రజలను కోరారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ కొంతమంది పెద్ద మొత్తంలో భూములను సాగు చేసుకుంటుండగా భూములు లేనివారు గ్రామంలో ఎంతోమంది ఉన్నారని వారికి కూడా న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో నసుర్లాబాద్ ఎమ్మార్వో సువర్ణ రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి, ఏడిఏ అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్, రైతులు, కబ్జాదారులు, గ్రామ ప్రజలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు అరెస్ట్

◆ రూ.75,000 విలువైన 1.5 కేజీల గంజాయి స్వాధీనం

భద్రాద్రి కొత్తగూడెం ఇల్లెందు ప్రతినిధి. ( జన సంఘర్షణ )




మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి రూ.75,000 విలువైన సుమారు 1.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, వారు ప్రయాణిస్తున్న ఎర్ర రంగు స్కూటీని జప్తు చేశారు. ఈ రోజు మధ్యాహ్నం కురవి పోలీస్ స్టేషన్ రెండవ ఎస్సై వి. జయకుమార్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ వెంకటయ్య, పీసీ సమ్మయ్య, పీసీ కాశిరాం, మహిళా కానిస్టేబుల్ పుష్పలతతో కలిసి వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో ఎర్ర రంగు స్కూటీపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించి, పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, వారి వద్ద ఉన్న బ్యాగ్‌లో గంజాయి లభించింది. గంజాయిని తూకం వేయగా సుమారు 1.5 కిలోలుగా ఉండి, దాని విలువ రూ.75,000గా గుర్తించారు. విచారణలో వారి పేర్లు అంగోత్ రాములు (తండ్రి: దామ్లా, నివాసం: తూర్పు తండా),కట్ల ఉమేష్ (తండ్రి: ఎల్లేశ్వర్, నివాసం: కురవి)గా తెలిసింది. వీరు కొంతకాలంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అరకు, సీలేరు ప్రాంతాల నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి, కురవి మరియు మహబూబాబాద్ ప్రాంతాల్లో విక్రయిస్తూ అక్రమంగా డబ్బు సంపాదిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అక్రమంగా గంజాయి రవాణా చేయడం, విక్రయించడం లేదా వినియోగించడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. గంజాయి పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన ఎస్సై వి. జయకుమార్, హెచ్‌సీ వెంకటయ్య, పీసీ సమ్మయ్య, పీసీ కాశిరాం, మహిళా కానిస్టేబుల్ పుష్పలతలను జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ పి., ఐపీఎస్, డీఎస్పీ తిరుపతిరావు, సీఐ సర్వయ్య అభినందించారు.

# గ్రంధాలయ చైర్మన్ రీడర్స్‌తో ముఖాముఖి

**తొట్టంబేడు మార్చ్ 11 (జన సంఘర్షణ) :**

శ్రీకాళహస్తి లోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయాన్ని సందర్శించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ చైర్మన్ రెడ్డివారి గురువారెడ్డి. సందర్భంగా గ్రంథాలయానికి విచ్చేస్తున్న రీడర్స్ తోను రెడ్డి వారి గురువారెడ్డి సమావేశంఅయి గ్రంథాలయంలో పేపర్ల అందుబాటులో ఉన్నాయా పుస్తకాలు అన్ని అందుబాటులో ఉన్నాయా అదేవిధంగా గ్రంథాలయం సంబంధించిన అన్ని విషయాల గురించి వారి ద్వారా తెలుసుకోవడం జరిగింది. కొద్దిసేపు వారితో కలిసి పేపర్ చదివి అదేవిధంగా లైబ్రరీ టైమింగ్స్ కు సంబంధించి వారి అభిప్రాయాన్ని తెలుసుకోవడం జరిగింది. ప్రస్తుతం శ్రీకాళహస్తి గ్రంథాలయంలో 3,400 మందికి పైన సభ్యులుగా ఉన్నారు. అదేవిధంగా రీడర్స్ సంఖ్య కూడా పెరగాలని అక్కడ ఉన్నటువంటి గ్రంథాల అధికారిని చైర్మన్ ఆదేశించడం జరిగింది. అనంతరం ఉన్నత పాఠశాల విద్యార్థులతో రీడర్స్ తో ముఖాముఖి సమావేశం నిర్వహించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డి వారి గురువారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కూడా అత్యధికంగా దేవాలయం లాంటి గ్రంథాలయం కి వచ్చి కరెంట్ అఫైర్స్ ,జనరల్ నాలెడ్జ్, న్యూస్ పేపర్లను చదువుకొని భవిష్యత్తులో మరింత ముందుకు పోవాలని ఆకాంక్షించారు. ప్రతిరోజు కూడా దేవాలయం లాంటి గ్రంథాలయం కు మీరువచ్చి విద్యార్థి దశ నుంచే ఇక్కడ పుస్తక పఠనం వైపు ఎక్కువ సమయం మగ్గుచూపువాల్సిందిగా వారికి దిశ నిర్దేశం చేయడమైనది. అదేవిధంగా కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తున్నారు. ఆ రూపంలో మరి మీ అందరి భవిష్యత్తు కోసం పుస్తక పఠనం వైపు ఎక్కువగా మొగ్గు చూపాలన్న ఆలోచనతో 13



సంవత్సరాల వయసు లోపు వారికి సెల్ ఫోన్ ని నిషేధించిన విషయాన్ని మీకందరికీ తెలియపరుస్తూ మరి దానికి హర్షం వ్యక్తంచేస్తున్నామన్నారు .దాని అర్థం మీరంతా కూడా పుస్తకాలు వైపు మొగ్గు చూపి గ్రంథాలయాల్లో వచ్చి చదువుకోవడం వల్ల మీకు జ్ఞానాన్ని పెంచుకోవచ్చని విషయాన్ని మీకు తెలియపరుస్తున్నామన్నారు. గతంలో గ్రంథాలయాల్లో స్వామి వివేకానందుని లాంటి మహానుభావులు పుస్తకాలు చదివి జ్ఞానాన్ని పెంచుకున్నారు అటువంటి మహానుభావులను స్ఫూర్తిగా తీసుకొని మీరంతా కూడా విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో పుస్తక పఠనం వైపు మొగ్గు చూపి మీ యొక్క జ్ఞానాన్ని పెంపొందించుకుని భవిష్యత్తు తరాల్లో మీరు మంచి స్థాయిలో ఉండాలని మనసారా కోరుకుంటున్నాం అన్నారు మరి గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలనే ఆకాంక్షతో పని చేస్తున్నటువంటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అదే విధంగా పని చేసే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు మనకు దొరకడం అదృష్టంగా భావించాలని మీకు సంబంధించినటువంటి అన్నింటిలో ప్రోత్సహించడానికి ప్రభుత్వం ముందుంది అనే విషయాన్ని మీకు తెలియపరుస్తున్నామన్నారు ప్రతిరోజు కూడా విద్యార్థి వయసులోనే గ్రంథాలయానికి వచ్చి అక్కడ గ్రూప్ డిస్కషన్ లో పాల్గొనడం వల్ల భవిష్యత్తులో మీరు పోటీ పరీక్షల్లో కూడా చురుగ్గా ఉత్సాహంగా పాల్గొని మెరుగైన ఫలితాలు సాధించ గలరు అనే విషయాన్ని మీకు తెలియపరుస్తున్నామన్నారు. అదేవిధంగా గ్రంథాలయం పరిసరాలను పరిశీలించి చైర్మన్ రెడ్డి వారి గురువారెడ్డి గ్రంథాలయ అధికారికి తగు సూచనలను అందించి, గ్రంథాలయ రిజిస్టర్లో సంతకం చేసి అదేవిధంగా రికార్డులను తనిఖీ చేసి రీడర్స్ ఎంతమంది ఉన్నారో విషయాన్ని తెలుసుకొని గ్రంథాలయం సంబంధించిన విషయాలన్నీ ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ చైర్మన్ రెడ్డి వారి గురవా రెడ్డి తో పాటు గ్రంథాలయ అధికారి ఎ.హరికృష్ణ, రీడర్స్, విద్యార్థులు , టీచర్ పాల్గొన్నారు.

# ఆర్‌వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు

**కోట మార్చ్ 11 (జన సంఘర్షణ) :**

డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జీవిత చరిత్ర భావి భారత పౌరులకు స్ఫూర్తిదాయకమని అంబేద్కరిస్ట్, ఆర్వి ఫౌండేషన్ చైర్మన్ ఎంబేటీ వెంకట కృష్ణయ్య పేర్కొన్నారు. ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని విద్యార్థులకు అంబేద్కర్ జీవిత చరిత్ర పై బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. కోట మండలంలోని కోట గూడలి, ఊనుగుంటపాలెం, చిట్టేడు, కొత్తపాలెం కొక్కుపాడు, వంజివాకా,ఉత్తమ నెల్లూరు, గోవిందపల్లి పాలెంలలోని ప్రభుత్వం ఉన్నత పాఠశాలకు చెందిన 8,9 తరగతి విద్యార్థులకు కోట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ వ్యాసరచన కార్యక్రమం నిర్వహించారు. ఈ వ్యాసరచన పోటీల్లో మండలంలోని 10 ఉన్నత పాఠశాల నుంచి దాదాపు 200 మంది విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం 10:30 నుంచి 11:30 వరకు జరిగిన ఈ వ్యాసరచన పోటీల్లో బాల, బాలికలు ఆసక్తికరంగా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్ వి ఫౌండేషన్ చైర్మన్ వెంకటకృష్ణ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేటి యువతకు ఆదర్శప్రాయుడని అన్నారు. నేటి ఆధునిక యుగంలో ఉరుకుల పరుగుల జీవితంలో శాస్త్ర సాంకేతిక రంగాలకి పరిమితం కాకుండా ఆదర్శ ప్రాయునులైన మహానుభావుల చరిత్ర తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పదవతరగతి పరీక్ష ఫలితాలు అనంతరం జిల్లా స్థాయి అధికారులు చేతులు మీదుగా ప్రతిభా పురస్కారం, వ్యాసరచన పోటీలో విజేతలకు బహుమతులు అందించడం జరుగుతుందన్నారు దళిత, బడుగు, బలహీన,వర్గాల కు రాజ్యాధికారం విద్య ద్వారా మాత్రమే వస్తుందని అంబేద్కర్ విశ్వసించడం జరిగింది అన్నారు. రాజ్యాంగంలో దళితుల అభివృద్ధి సముచిత స్థానం కల్పించడం జరిగిందన్నారు. అంబేద్కర్ ఆశయాలు, సిద్ధాంతాల ప్రాతిపదికను ఏర్పడిన ఆర్ వి ఫౌండేషన్ విద్యలో ప్రతిభావంతులను ప్రోత్సహించడానికి 2026 నుంచి ఆర్.వి ఫౌండేషన్ ప్రతిభ పురస్కారాలను అంబేద్కర్ వర్ధంతి డిసెంబర్ 6 సందర్భంగా ప్రకటించడం జరిగింది అన్నారు. 2026 ఏప్రిల్ లో అంబేద్కర్ 135 వ జయంతిని పురస్కరించుకొని కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రతిభ నగదు పురస్కారాలను ఆర్ వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందచేస్తామన్నారు. ఈ క్రమంలో 2025- 26 విద్యా సంవత్సరానికి ఈ నాలుగు మండలాలలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు కు ఆర్ వి ఫౌండేషన్ ఒక్కొక్కరికి 5000 రూపాయలు నగదును అందించడం జరుగుతుంద న్నారు. అలాగే కోట మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో 8,9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నేడు అంబేద్కర్ జీవిత చరిత్ర పై వ్యాసరచన పోటీలు నిర్వహిచమన్నారు . ఈ వ్యాసరచన పోటీల్లో ప్రతి పాఠశాలలో మొదటి బహుమతి 3000, రెండవ బహుమతి 1000 రూపాయలు, ప్రోత్సాహక బహుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. పదవతరగతి పరీక్ష ఫలితాలు అనంతరం జిల్లా స్థాయి అధికారులు చేతులు మీదుగా ప్రతిభా పురస్కారం, వ్యాసరచన పోటీలో విజేతలకు బహుమతులు అందించడంజరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి కోట మండల విద్యాశాఖ అధికారి



మస్తానయ్య, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరుణాకర్ రెడ్డి, అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు, బాలు రావు కోట బాలుర ఉన్నత పాఠశాల అధ్యాపక అధ్యాపేకర బృందం అందించిన సహాయ సహకారాలు వెలకట్టలేనిమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ వి ఫౌండేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతిలో మొదటి విజేతకు రూ.5వేలు బహుమతి

◆ **డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు**



**శ్రీకాళహస్తి మార్చ్ 11 (జన సంఘర్షణ) :**

శ్రీకాళహస్తి ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ... పదవ తరగతి పరీక్షల్లో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.5వేలు నగదు బహుమతి అందిస్తానని ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు ప్రకటించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని భాస్కర్ పేట, పానగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షలు రాయబోతున్న 65 మంది విద్యార్థులకు బుధవారం ఆయన పరీక్ష సామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా యల్లంపాటి కోటేశ్వరబాబు మాట్లాడుతూ... "పదవ తరగతి అనేది ప్రతి విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమైన మలుపు. పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదు. ప్రతి విద్యార్థి పట్టుదలతో, క్రమశిక్షణతో చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో అద్భుతమైన ప్రతిభ ఉంటుంది, దానికి సరైన ప్రోత్సాహం తోడైతే వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారు. ప్రభుత్వ బడుల్లో చదివే పేద విద్యార్థులకు నా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది." అన్నారు. సమాజ సేవలో తనదైన ముద్ర వేస్తున్న డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు, ప్రభుత్వ బడుల్లో చదివే పేద విద్యార్థుల పట్ల తనకున్న మక్కువను మరోసారి చాటుకున్నారు. కేవలం ప్రోత్సాహకాలకే పరిమితం కాకుండా, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో ఆయన ముందుంటున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది శ్రీకాళహస్తి మండలం, శ్రీకాళహస్తి పట్టణం మొత్తం కలిపి 546 మంది విద్యార్థులకు పదవ తరగతి పరీక్ష సామాగ్రి అందజేశామని గర్వంగా ప్రకటించారు. విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంచేందుకు, మండలం, పట్టణ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.5,000 నగదు పురస్కారం ప్రకటించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఆయన చేస్తున్న ఈ కృషి అభినందనీయమని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కొనియాడుతున్నారు. పరీక్షా సామాగ్రిని అందుకున్న విద్యార్థులు తమపై నమ్మకం ఉంచి సహకరిస్తున్న డాక్టర్ కోటేశ్వరబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ, కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ

◆ **కలవగుంట భరత్ రెడ్డి**

**తొట్టంబేడు మార్చ్ 11 (జన సంఘర్షణ) :**




పదవ తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రముఖ సంఘ సేవకులు కలవగుంట భరత్ రెడ్డి ఆకాంక్షించారు. తొట్టంబేడు మండలం చిట్టత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ చేశారు. అదేవిధంగా రగ్బీ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపుతున్న పదో తరగతి చదువుతున్ దయాసాగర్ అనే విద్యార్థిని ప్రోత్సహిస్తూ తనవంతు ఆర్థిక సాయం చేసి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కలవగుంట భరత్ రెడ్డి మాట్లాడుతూ.. పదవ తరగతి అనేది విద్యార్థుల భవిష్యత్తుకు తొలి మెట్టు అని, ఈ పరీక్షల్లో సాధించే ఫలితాలే ఉన్నత శిఖరాలకు దారి చూపుతాయని పేర్కొన్నారు. "ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో, పట్టుదలతో చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలి. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో అద్భుతమైన ప్రతిభ ఉంటుంది. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయం" అని విద్యార్థులను ఉత్సాహపరిచారు. రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన దయాసాగర్ వంటి క్రీడాకారులను ప్రోత్సహించడం తన బాధ్యతగా భావిస్తున్నానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాపూరు సుబ్రహ్మణ్యం, తెలుగు ఉపాధ్యాయురాలు లోకనాయకి, బేబీ త్రిషికా రెడ్డి,గురునాథం, వాసు, నాగరాజు, దానా, వెంకటేష్, మోతీష్, శ్యామ్, గోపి, రవి, రాము, లోకేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

# వీబీ జీరామ్‌జీ లో ఇక ఉపాధి శ్రామికులకు 125 పని దినాలు

**సోమల, మార్చ్ 11 (జన సంఘర్షణ) :**



మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న వీబీజీ రామ్‌జీ పథకంలో గ్రామీణ ఉపాధి శ్రామికులకు సంవత్సరానికి 125 పనిదినాలు కల్పించనున్నట్లు ఎంపీడీవో జీ.వి.ఎస్.వి. ప్రసాద్ తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించిన ప్రజా చైతన్య , అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ సీజన్ సమయంలో 60 రోజుల పాటు ఉపాధి పనులకు విరామం ఉంటుందని తెలిపారు. కొత్త పథకంలో కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల వ్యయభారం 60:40 నిష్పత్తిలో ఉంటుందని చెప్పారు. అలాగే పరిపాలనా వ్యయాన్ని 6 శాతం నుంచి 9 శాతానికి పెంచినట్లు వివరించారు. వీబీజీ రామ్‌జీ పథకం ద్వారా జల సంరక్షణ పనులు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, జీవనోపాధి అభివృద్ధి కార్యక్రమాలు, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనే పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. సహజ వనరుల యాజమాన్యం కింద భూ సంరక్షణ, జల సంరక్షణ, అటవీకరణ వంటి పనులకు అధిక ప్రాధాన్యం కల్పిస్తారని చెప్పారు. వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనలో భాగంగా ఈ పథకాన్ని కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు మరింత పటిష్టంగా అమలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక, సామాజిక, సాంకేతిక అభివృద్ధికి ఈ పథకం తోడ్పడుతుందని వివరించారు. ఎంజీ నరేగా తరహాలోనే ఈ పథకంలో కూడా వ్యక్తిగత, సామాజిక పనులకు అనుమతి ఉండి, గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత ఆస్తుల నిర్మాణం, జీవనోపాధి మెరుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాసులు, ఏపీవో షౌకత్ అలీ, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు రెడ్డి, పంచాయతీ అభివృద్ధి అధికారులు, ఇతర శాఖల అధికారులు, ఉపాధి హామీ క్షేత్ర సిబ్బంది, సాంకేతిక సహాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మండలంలో కౌమారధశలో గర్భదార నివారణ కార్యక్రమం

**పిచ్చాటూరు మార్చ్ 11 (జన సంఘర్షణ) :**




పిచ్చాటూరు మండలం లో గల వెలుగు కార్యాలయం లో ఐసిడిఎస్ సి.డి.పి. ఓ. సౌభాగ్యమ్మ, ఎ.పి.యం. చంద్రకళ ఆధ్వర్యంలో నిర్వహించారు, గర్భ వతులకు లింగనిర్ధారణ స్కాన్ చేయడం చట్ట విరుద్ధమని, అదేవిధంగా యుక్త వయస్సు లో గర్భవతులు కావడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం సిడిపిఓ సౌభాగ్యమ్మ మాట్లాడుతూ ఇపుడున్న పరిస్థితుల్లో గర్భవతులు, బాలింతలు, బాలికలు ఆరోగ్యం పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న చట్టాలపై సమాచారం తెలుసుకోవాలని, బాల్యవివాహాలపై పూర్తిఅవగాహన ఉండాలని, గ్రామంలో బాల్య వివాహాలు జరిగితే సంబంధిత అంగన్వాడీ కార్యకర్త కు, సహాయకురాలకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ లు బేబీ, రాజేశ్వరి, బజావతి, సుమతి, శ్రీదేవి, కల్పలత, వెలుగు సి.సి.లు, సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## విద్యార్థిని చితకబాదిన టీచర్పై కఠిన చర్యలు తీసుకోవాలి

- గౌతమ్ హైస్కూల్ ముందు ఏబీవీపీ ఆధ్వర్యంలో భారీ నిరసన
- ఏబీవీపీ జగిత్యాల జిల్లా కన్వీనర్ మాడవేణి సునీల్



**కోరుట్ల జన సంఘర్షణ**

కోరుట్ల పట్టణంలోని గౌతమ్ హైస్కూల్లో ఐదవ తరగతి చదువుతున్న సాత్విక్ అనే విద్యార్థిపై సోషల్ టీచర్ అమానుషంగా దాడి చేయడాన్ని నిరసిస్తూ, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కోరుట్ల శాఖ ఆధ్వర్యంలో బుధవారం పాఠశాల ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జగిత్యాల జిల్లా కన్వీనర్ మాడవేణి సునీల్ మాట్లాడుతూ.. విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులే విద్యార్థుల పట్ల కర్కశంగా వ్యవహరించడం దారుణమన్నారు. కేవలం చిన్న కారణంతో ఐదవ తరగతి అబ్బాయిని అతి దారుణంగా కొట్టడం ఆ... ఉపాధ్యాయురాలి విజ్ఞతకే విరుద్ధమని మండిపడ్డారు. ఈ పాఠశాలలో ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని, యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే విద్యార్థులకు రక్షణ లేకుండా పోతోందని ఆరోపించారు.

**ఏబీవీపీ ప్రధాన డిమాండ్లు:**

విద్యార్థిని కొట్టిన సదరు టీచర్పై కఠిన చర్యలు తీసుకోవాలి.నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న గౌతమ్ హైస్కూల్ గుర్తింపును వెంటనే రద్దు చేయాలి.భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ఎంఈఓ ప్రత్యేక నిఘా ఉంచాలి. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు వాసాల మహదేవ్, తరుణ్, అభిషేక్, మనీష్, వికాస్ మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు...

## పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ

**చెరుకుపల్లి శివరాణి రాజు**



**ప్రజావారధి జన సంఘర్షణ :**

మాడుగులపల్లి మండలంలోని చెరువుపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు గ్రామ పదవ వార్డు మెంబర్ చెరుకుపల్లి శివరాణి రాజు ఆధ్వర్యంలో పరీక్ష రాయబోతున్న 10 మంది విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు,పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి జీవితాన్ని మలుపు తిప్పే పరీక్ష అని శ్రద్ధగా చదువుకొని మంచిగా పరీక్షలు రాయాలని వత్తిడి లేకుండా చదువుకుని ఆహ్లాదకర వాతావరణంలో ఒత్తిడి లేకుండా జీవితంలో ఎదగాలని విద్యార్థులకు ఆల్ ద బెస్ట్ చెప్పారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభుదాస్,ఉపాధ్యాయులు వేణుగోపాలస్వామి,సోమయ్య, వెంకటయ్య, వెంకటేశ్వర్లు,రాజయ్య,భిక్షం మమత,సలీం పాష,జానీ పాష,తదితరులు పాల్గొన్నారు.

## రత్నపురి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల హెచ్ఓడిని అరెస్టు చేయాలి

**- ఏఐఎస్ఎఫ్,ఎస్ఎఫ్ఐ డిమాండ్**



**సంగారెడ్డి జన సంఘర్షణ :**

రత్నపురి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో విద్యార్థులను చితకబాదిన హెచ్ఓడిపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశా యి.ఈ ఘటనను నిరసిస్తూ బుధవారం కళాశాల ముందు విద్యార్థులతో కలిసి ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తు రెడ్డి, ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి సతీష్ మాట్లాడుతూ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న సుమారు 15 మంది విద్యార్థులపై హెచ్ఓడి కేబుల్ వైర్తో విచక్షణ రహితంగా దాడి చేయడం దారుణమని ఖండించారు.విద్యార్థులను క్రమశిక్షణ పేరుతో శారీరకంగా హింసించడం అనేది పూర్తిగా తప్పని, ఇది విద్యార్థుల హక్కులకు విరుద్ధమని తెలిపారు.ఈ ఘటనపై ఇప్పటివరకు సంబంధిత హెచ్ఓడిని పోలీసులు అదుపులోకి తీసుకోకపోవడం దురదృష్టకరమని, ప్రస్తుతం అతను పరారీలో ఉన్నట్లు సమాచారం ఉందని పేర్కొన్నారు. వెంటనే అతన్ని అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే కళాశాల యాజమాన్యం కూడా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.విద్యార్థులపై ఇలాంటి దాడులు పునరా వృతం కాకుండా ప్రభుత్వం మరియు విద్యాశాఖ అధికారులు వెంటనే జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కే వి ఎల్ ఎన్ రెడ్డి కళాశాల విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆస్తి కోసం కన్నతల్లిని ఇబ్బంది పెడుతున్న కొడుకు

**బాధితురాలికి అండగా నిలిచిన దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్**

**సుజాతనగర్ జన సంఘర్షణ :**

సుజాతనగర్ మండలం నరసింహ సాగర్ కు చెందిన దంసలపూడి పద్మ అనే మహిళను తన కొడుకు నాగరాజు, ఆస్తి కోసం కొడుతూ తిడుతూ ప్రతిరోజు ఇబ్బంది పెడుతున్నాడు. ఇబ్బందులు తట్టుకోలేక ఆ మహిళ దిశ ప్రొటెక్షన్ టౌన్ అధ్యక్షురాలు అరుణ ను ఆశ్రయించింది. దిశ ప్రొటెక్షన్ ఫౌండేషన్ చైర్మన్ బీవీ రాజు, ఉపాధ్యక్షులు కళ్యాణి, జిల్లా అధ్యక్షురాలు పూజల లక్ష్మీ, జిల్లా జనరల్ సెక్రెటరీ పిట్టల కమలమ్మ సూచనతో టౌన్ అధ్యక్షురాలు బొల్లం అరుణ ఆధ్వర్యంలో బాధిత మహిళ దంసలపూడి పద్మతో మాట్లాడిన సభ్యులు ఆమె సమస్యను తెలుసుకుని సుజాతనగర్ పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఎస్సై రమాదేవి ని కలిసి పద్మ న్యాయం జరిగేలా చూడాలని మాట్లాడి బాధితురాలు కొడుకుపై ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో రుద్రంపూర్ మండల ప్రెసిడెంట్ దేవరపల్లి రజిని, జగన్నాథపురం మండల ప్రెసిడెంట్ గడ్డం జ్యోతి, టౌన్ వైస్ ప్రెసిడెంట్ మందకృష్ణ వేణి, దిశా సభ్యురాలు బిందు పాల్గొన్నారు.

## పేదల ఇళ్ల స్థలాలను లాక్కోవద్దు తాసిల్దార్కు బొమ్మకల్లు గ్రామస్తుల విన్నపం

**మాడుగుల పల్లి జన సంఘర్షణ :**

తమకు ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాలను కాపాడాలని కోరుతూ నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం బొమ్మకల్లు గ్రామస్తులు బుధవారం తాసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం నిరుపేదలైన తమకు నివాసం కోసం పట్టాలు ఇచ్చిందని, ఇప్పుడు ఆ స్థలాలను వి.ఓ కార్యాలయం పేరుతో లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.పట్టాల కేటాయింపు బొమ్మకల్లు గ్రామానికి చెందిన రేణుక, వెంకన్న సహా మరో 20 మందికి గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల పట్టాలు మంజూరయ్యాయి.ఆక్రమణ యత్నం నూతనంగా ఎన్నికైన సర్పంచి, ప్రభుత్వం కేటాయించిన ఈ నివాస స్థలాల్లో వి.ఓ ఆఫీస్ భవనాన్ని నిర్మించాలని



చూస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. బాధితుల ఆవేదన మేమంతా రెక్కాడితే గానీ డొక్కాడని పేదలము. మాకు ఉన్న ఏకైక ఆధారం ఈ ఇళ్ల పట్టాలే. ఇప్పుడు మా స్థలాలను లాక్కుంటే మేము ఎక్కడికి వెళ్లాలి అని బాధితులు ప్రశ్నించారు.న్యాయం చేయాలని తమకు కేటాయించిన భూమిని కాపాడి, అక్కడ వి.ఓ ఆఫీస్ నిర్మాణం చేపట్టకుండా ఆపాలని తాసిల్దార్ను కోరారు.



ఈ కార్యక్రమంలో రేణుక, సైదమ్మ, గంగ, మమత, రామ్ రెడ్డి, లచ్చమ్మ, సైదమ్మ, రమ్య, నరసమ్మ, నాగేశ్వరి, సరిత గ్రామస్తులు పాల్గొన్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

## ఎస్టీ బాలికల హాస్టల్ సమస్యలపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**కల్వకుర్తి జన సంఘర్షణ :**

కల్వకుర్తి నియోజకవర్గం వెల్దండ మండల కేంద్రంలోని ఎస్టీ బాలికల హాస్టల్లో నెలకొన్న పలు సమస్యలను నెలకొన్నాయని వెల్దండ గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మవెంకటయ్య గౌడ్ ఇటీవలే జిల్లా కలెక్టర్ బాదవత్ సంతోష్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. సర్పంచ్ ఇచ్చిన సమాచారంపై స్పందించిన జిల్లా కలెక్టర్ వెంటనే మండల గిరిజన గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్లో విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలు, తాగునీరు, ఆహారం, పరిశుభ్రత, వసతి తదితర అంశాలను కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా హాస్టల్లో ఉన్న



సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. విద్యార్థినుల సంక్షేమం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని ఆయన హెచ్చరించినట్లు,హాస్టల్లో ఉన్న లోపాలను వెంటనే సరిచేసి విద్యార్థినులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలో సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## మండలంలోని ఆశ్రమ పాఠశాలలు వసతి గృహాల్లో వైద్య శిబిరాలు

**అన్నపురెడ్డిపల్లి జన సంఘర్షణ :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశానుసారం, బుధవారశీ అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలోని అన్ని ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించబడ్డాయి. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక, నేతృత్వంలో వివిధ వైద్య బృందాలు విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాయి.

**ముఖ్య సూచనలు:**

శిబిరంలో భాగంగా డాక్టర్ ప్రియాంక, వసతి గృహాలలోని వంటశాలలను స్వయంగా పరిశీలించి, వంట నిర్వాహకులకు అధికారులకు పలు సూచనలు చేశారు.

రక్తహీనత నివారణ:

బాలికల వసతి గృహాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రక్తహీనత (Anemia) ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ (IFA) మాత్రలు వేయించాలని ఆదేశించారు.

**ఆహార భద్రత:**

పిల్లలకు నిల్వ ఉన్న ఆహార పదార్థాలను పెట్టవద్దని, ఎల్లప్పుడూ తాజా మరియు పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. ఏదైనా అత్యవసర ఆరోగ్య పరిస్థితి తలెత్తితే వెంటనే వైద్య సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు.









**వ్యక్తిగత పరిశుభ్రత:**

విద్యార్థులకు చేతుల శుభ్రత యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ' టెక్నిక్ ద్వారా ప్రతిరోజూ చేతులను ఎలా శుభ్రం చేసుకోవాలో ప్రత్యక్షంగా వివరించారు.పాల్గొన్న అధికారులు సిబ్బంది ఈ కార్యక్రమంలో వసతి గృహాల ప్రత్యేక అధికారులు ప్రిన్సిపాల్స్ చురుగ్గా పాల్గొన్నారు. వారిలో సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపాల్ బాలరాజు, ట్రైబల్ వెల్ఫేర్ ప్రిన్సిపాల్ చైతన్య, కేజీబీవీ (KGBV) ప్రత్యేక అధికారిణి శారదా, ఎంజేపీ జూనియర్ ఓ డిగ్రీ కళాశాల ప్రత్యేక అధికారి బురాన్ ఉన్నారు.వైద్య ఆరోగ్య శాఖ తరఫున ఎస్తేర్ రాణి, హెల్త్ ఎడ్యుకేటర్ జయలక్ష్మి, హెల్త్ సూపర్వైజర్ ప్రకాశరావు, మరియు ఇతర వైద్య సిబ్బంది వాణి, లు సోనియా, లావణ్య, రామదాసు, కోటేశ్వరరావు, జయలక్ష్మి మరియు ఆశా కార్యకర్తలు) ఈ శిబిరాల్లో పాల్గొని విద్యార్థులకు సేవలు అందించారు.

## తెలంగాణ క్రీడా పాఠశాలలో 4వ తరగతి ప్రవేశాల కోసం మండల స్థాయి ఎంపికలు

**మండల విద్యాశాఖధికారి ఉండేటి ఆనంద్ కుమార్**

**అన్నపురెడ్డిపల్లి జన సంఘర్షణ :**

అన్నపురెడ్డిపల్లి మండలం లో తెలంగాణ క్రీడా పాఠశాలలో 4 వ తరగతి ప్రవేశాల కోసం మార్చి 13 నుండి 17 వ తారీఖు వరకు మండల విద్యా వనరుల కేంద్రములో ఎంపికలు నిర్వహించడం జరుగుతుందని మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద కుమార్ తెలిపారు. ప్రస్తుతం 3 వ తరగతి చదువుతున్న పాఠశాల విద్యార్థులు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకొని ఈ ఎంపికలో పాల్గొనాలని తెలియజేశారు. తెలంగాణ క్రీడా పాఠశాలలు హకింపేట,



మేడ్చల్, కరీంనగర్, ఆదిలాబాద్ ప్రాంతాలలో ఉన్నాయని తెలిపారు. ఈ ఎంపికలను మండల విద్యాశాఖధికారి ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు సున్నం కృష్ణారావు, లకావత్ జయరాం, వ్యాయమ ఉపాధ్యాయులు శీలం శ్రీనివాస్, వగ్గేలా స్వాతి నిర్వహిస్తారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
గురువారం
12 మార్చి 2026

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

- **సురక్షిత త్రాగునీటి వినియోగంపై ప్రజలకు అవగాహన అవసరం**
- **చదువుల్లో ముందుండాలంటే విద్యార్థుల వంద శాతం హాజరు తప్పనిసరి**
- **చంద్రుగొండ మండల పర్యటన లో జిల్లా కలెక్టర్ అంకిత్**







**చంద్రుగొండ జన సంఘర్షణ :**
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలంలో బుధవారం జిల్లా కలెక్టర్ అంకిత్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని బెండలపాడు గ్రామం సహా పలు ప్రాంతాల్లో పాఠశాలలు, అంగన్వాడీ కేంద్ర నిర్మాణం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు, ఆశ్రమ పాఠశాల, బస్టాండ్ పారిశుద్ధ్య కార్యక్రమాలు తదితర అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. చంద్రుగొండ మండలం బెండలపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మిషన్ భగీరథ ఆధ్వర్యంలో ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించిన సురక్షిత త్రాగునీటి వినియోగంపై అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోర్ నీరు, మిషన్ భగీరథ నీరు, ఆర్వో ప్లాంట్ ద్వారా శుద్ధి చేసిన నీటిలో లవణాల తేడాలను ప్రయోగాత్మకంగా ప్రజలకు వివరించారు. త్రాగునీటిలో ఉండే సహజ మినరల్స్ మన శరీరానికి అత్యంత అవసరమని, అధికంగా శుద్ధి చేసిన నీటిని మాత్రమే వినియోగించడం వల్ల అవసరమైన లవణాలు తగ్గి ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశముందని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా అందుతున్న సురక్షిత మంచినీటిని ప్రజలు తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. ప్రజల్లో సురక్షిత త్రాగునీటి వినియోగంపై అవగాహన పెంపొందించేందుకు అధికారులు మరింత చురుకుగా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అలాగే రేపు నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులకు నిర్వహించనున్న ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాల్గొని ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో చురుకుగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం బెండలపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న మధ్యాహ్న భోజనం, వారానికి ఎన్ని గుడ్లు అందుతున్నాయి, భోజనం నాణ్యత ఎలా ఉందనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల తరగతి గదిలో ఏర్పాటు చేసిన పెయింటింగ్లు పరిశీలించి అభినందించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడిన కలెక్టర్ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, హాజరు శాతం, మరుగుదొడ్ల సంఖ్య, వాటి పరిశుభ్రత వంటి అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. పాఠశాలలో 120 మంది విద్యార్థులు ఉండగా హాజరు శాతం తక్కువగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్ దీనిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు తరగతులకు క్రమం తప్పకుండా హాజరు కాకపోతే చదువుల్లో వెనుకబడే ప్రమాదం ఉంటుందని తెలిపారు. ప్రతి విద్యార్థి పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరు అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అవసరమైతే విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించి పిల్లలను పాఠశాలకు పంపేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. పాఠశాలలోని మరుగుదొడ్ల పరిశుభ్రతను పరిశీలించి వాటిని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. వంటగదిలో ఆహార పదార్థాలు, నిల్వ సరుకులను తనిఖీ చేసి విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందించాలని అధికారులకు సూచించారు.గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. పలువురు లబ్ధిదారుల ఇండ్ల నిర్మాణ పనులను ప్రత్యక్షంగా తనిఖీ చేసి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. లబ్ధిదారులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి ఇల్లు నిర్మాణానికి మహిళా సంఘాల ద్వారా రుణాలు తీసుకున్నారా, నిర్మాణానికి అవసరమైన ఇసుక ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారు, పనులు కొనసాగించడంలో ఏవైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ఇప్పటికే ఇందిరమ్మ ఇండ్లను పూర్తి చేసుకుని నివాసం ఉంటున్న కుటుంబాలను కూడా కలెక్టర్ సందర్శించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చంద్రుగొండలో నూతనంగా నిర్మిస్తున్న అంగన్వాడీ కేంద్ర భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల శారీరక, మానసిక అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు ఎంతో కీలకమని అన్నారు . గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం, ఆరోగ్య సేవలు అందించే ప్రధాన కేంద్రాలుగా అంగన్వాడీలు పనిచేస్తున్నాయని తెలిపారు. అందువల్ల అంగన్వాడీ భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, వంటగది, త్రాగునీటి వసతి, కిచెన్ గార్డెన్ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. తొమ్మిదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా, ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు సరిపడా మరుగుదొడ్లు లేవని, క్రీడలు ఆడుకునేందుకు ఫిజికల్ ట్రైనర్ అవసరమని తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఐటీడీఏ పీవోతో మాట్లాడి అవసరమైన మరుగుదొడ్లు నిర్మించడంతో పాటు ఫిజికల్ ట్రైనర్ను ఏర్పాటు చేస్తామని తెలిపారు.ఐదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి పాఠ్యపుస్తకాలను చదివించి ఇంగ్లీష్ చదవడంలో వారి సామర్థ్యాలను పరిశీలించారు. ఐటీడీఏ ప్రత్యేకంగా రూపొందించిన “ఉద్దీపకం” పుస్తకాన్ని కూడా పరిశీలించారు. కిచెన్ షెడ్ను తనిఖీ చేసి మెనూ ప్రకారం ఆహారం వండుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. బయట నుంచి తెచ్చే పెరుగు కలుషితం అయ్యే అవకాశం ఉన్నందున పాలను కాచి పాఠశాలలోనే పెరుగు తయారు చేసి విద్యార్థులకు అందించాలని సూచించారు. ఆహార పదార్థాలను చల్లటి ప్రదేశంలో భద్రపరచాలని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్ను అభినందిస్తూ లైబ్రరీ ఏర్పాటు చేయాలని సూచించారు. చంద్రుగొండ బస్టాండ్ను కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను సమీక్షించారు. బస్టాండ్ ఆవరణలోకి బస్సులు రావడం లేదని సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సులు బస్టాండ్లోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం బస్టాండ్లో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ మరుగుదొడ్లను పరిశీలించి వాటిని పరిశుభ్రంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో సీపీఓ సంజీవరావు, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో అశోక్, ఎంపీవో ఖాన్, ఎంపీపీ ఖాన్, బిడ్డలపాడు సర్పంచ్ బొర్రా లలిత కుమారి, చంద్రుకొండ సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి, ఎంఈఓ,పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

### అశోక్ నగర్ కాలనీలోని వివిధ వార్డులలో పారిశుద్ధ కార్యక్రమం





**కొత్తగూడెం జన సంఘర్షణ :**
ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో 6వ రోజు సందర్భంగా అశోక్ నగర్ కాలనీలోని పారిశుద్ధ కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ప్రదేశాలు పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బందితోపాటు 1వ వార్డ్ మెంబర్ జర్పుల మురళి, 8వ వార్డు మెంబర్ పడాల రమ, తదితరులు పాల్గొన్నారు. వారిని స్థానికులు అభినందించారు.

## ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అబ్దుల్ రహీంను పరామర్శించిన కొండూరి



**రాజన్న సిరిసిల్ల జిల్లా/గంభీరావుపేట/మార్చి11 జన సంఘర్షణ**
గంభీరావుపేట మండల ఎస్ ఎస్ కేబుల్ రిపోర్టర్ మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అబ్దుల్ రహీంని మాజీ నాస్కప్ చైర్మన్ కొండూరి రవీందర్రావు.వీరి వెంట టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాప గారి వెంకటస్వామి గౌడ్.మరియు మండల ఉప సర్పంచ్ కమలాకర్ రెడ్డి పరామర్శించారు ఇటీవల అబ్దుల్ రహీం కంటి ఆపరేషన్ చేయించుకున్న విషయం తెలుసుకొని తన ఇంటికి వెళ్లి పరామర్శించారు,ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు

## నగరంలో అభివృద్ధి పనులకు 3.36 కోట్ల నిధులు మంజూరు చేయండి

:-జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ను కోరిన రామగుండం మేయర్

**గోదావరిఖని,మార్చి 11 జన సంఘర్షణ :-**
నగరంలో పారిశుద్ధ్యం,నీటి సరఫరా,వీధి దీపాల సమస్యలను పరిష్కరించడానికి రూ 3.36 కోట్ల నిధులు అత్యవసరంగా మంజూరు చేయాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి జిల్లా కలెక్టర్ ని కోరారు.పెద్దపల్లి లోని ఒక ఫంక్షన్ హాల్ లో బుధవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పై జిల్లాల లోని మునిసిపాలిటీల ప్రజా ప్రతినిధులకు నిర్వహించిన ఓరియెంటేషన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న వేసవికాలంలో నీటి కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టడంలో భాగంగా బోర్ బావుల మరమ్మత్తులు,కొత్త బోర్ బావులు తవ్వడం,లీకేజీలు మరమ్మత్తులు,విలీన గ్రామాలతో పాటు సరఫరా లేని ప్రాంతాలకు పైప్ లైన్లు వేయడంలాంటి పనులకు ఒక కోటి రూపాయలు,వీధి దీపాల విడి భాగాల కోనుగోలు, కొత్త వీధి దీపాల,కూడళ్లలో మినీ హై మాస్ట్ లైట్లు ఏర్పాటుకు ఒక కోటి ముప్పది ఆరు లక్షల రూపాయలు,పారిశుద్ధ్య వాహనాల మరమ్మత్తులు, బ్లీచింగ్,సున్నం తదితరాలకు మరో కోటి రూపాయల వరకు ఖర్చవుతాయని అంచనా వేశామని అన్నారు.నగర పాలక సంస్థ ఖజానా లో నిధుల కొరత దృష్ట్యా సి ఎస్ ఆర్,డి ఎం ఎఫ్ టి లేదా ఇతర అందుబాటులో ఉన్న నిధుల నుండి అత్యవసరంగా రూ 3.36 కోట్ల రూపాయలు మంజూరు చేయాలని కోరారు.ఈ మేరకు అంచనాలతో కూడిన ప్రతిపాదనలు సమర్పించారు. సమావేశానికి రామగుండం నుండి శాసన సభ్యులు ఎం ఎస్, రాజ్ ఠాకూర్ తో పాటు, డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య,




Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co